ప్రజల ప్రాణాలతో చెలగాటం

• జాతీయ రహదారిపైనే బాణాసంచా దుకాణాలు • అనుకోని ప్రమాదం జరిగితే..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): బస్సులు, లారీలు, స్కూల్ బస్సులు, బైకులు.. ఇతర చిన్నపెద్ద వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారులపైన రోజూ వేల మంది ప్రయాణిస్తూ ఉంటారు. అటువంటి జనసమ్మర్ధ రోడ్లపైన జిల్లాలో కొందరు వ్యాపారులు నిబంధనలు పక్కన పెట్టి.. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి బాణాసంచా దుకాణాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదకరమైన బాణాసంచా అమ్మకాలు జరుగుతున్నా కొందరు అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జాతీయ రహదారులపై బాణాసంచా దుకాణాలు ఉన్నచోట ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఒకప్పుడు దీపావళి పండుగకు బాణాసంచా కాల్చేవారు. అయితే మారుతున్న కాలాన్ని బట్టి దీపావళి పండుగతో సంబంధం లేకుండా రాజకీయ కార్యక్రమాలు, జాతరలు, ఊరేగింపులు..చావులు, పుట్టిన రోజు వేడుకలు ఇలా దాదాపు ప్రతి కార్యక్రమానికి టపాకాయలు కాల్చడం సర్వసాధారణమై పోయింది. దీంతో సంవత్సరం పొడవునా టపాకాయల దుకాణాలు జనాలతో కళకళలాడుతూ ఉంటాయి. అయితే ఇదే సమయంలో టపాకాయల దుకాణాల యజమానులు ప్రజల రక్షణ గురించి ఆలోచించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జాతీయ రహదారిపైన.. ఇతర వాణిజ్య దుకాణాలు, నివాస గృహాలు ఉన్నప్పటికీ నిబంధనలను లెక్క చేయకుండా.. టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పాటు చేయకూడదని అడిగేవాళ్లే లేక.. దర్జాగా అమ్మకాలు చేస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వం ద్వారా అనుమతులు పొంది సంవత్సరం పొడవునా హోల్‌సేల్ వ్యాపారం చేసే టపాకాయల దుకాణాలు దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ ఒకటో, రెండో ఉన్నాయి. మదనపల్లె పట్టణ పరిధిలో మూడు లైసెన్స్ ఉన్న దుకాణాలు ఉన్నాయి. మదనపల్లె మండలం వేంపల్లి వద్ద ఒకటి.. పుంగనూరు రోడ్డులోని వలసపల్లె వద్ద రెండు ఉన్నాయి. ఇవి పెద్ద స్థాయి గోడౌన్లుగానే చెప్పవచ్చు. ఇవి ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జనావాసాలకు దూరంగా ఉన్నాయి. రైల్వే కోడూరు మండలం రాఘవరాజపురం పరిధిలో ఉన్న దుకాణం, చిట్వేలి మండలం గరుగుపల్లె వద్ద ఉన్న దుకాణం ఊరికి దూరంగా ఉంది. పీలేరు నియోజకవర్గ పరిధిలో ఉన్న రెండు దుకాణాలు జనావాసాలకు దూరంగా ఉన్నాయి. రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లె సమీపంలో ఉన్న ఒక దుకాణం రోడ్డుకు దూరంగా ఉంది. రాయచోటి రింగు రోడ్డు వద్ద ఉన్న దుకాణం కూడా జనావాసాలకు దూరంగా ఉంది.


రాజంపేటలో కడప-తిరుపతి ప్రధాన రహదారిలో ఉన్న టపాకాయల దుకాణం

ఆ షాపుల దారి రహదారి..

ప్రభుత్వ అనుమతులు పొందిన బాణాసంచా దుకాణాల్లో కొన్ని నిబంధనల మేరకు జనావాసాలకు దూరంగా ఉంటే కొన్ని మాత్రం జాతీయ రహదారిపైనే ఉన్నాయి. చిన్నమండెం మండలంలో సాయి గణేష్ ట్రేడర్స్, రాజంపేట పట్టణంలో నారాయణ సాగర్ పటాకుల అంగడి ఉన్నాయి. వీరబల్లి మండలంలో ఉన్న మూడు దుకాణాలూ రోడ్డులోనే ఉన్నాయి. చిన్నమండెం మండలంలో ఉన్న దుకాణం కడప-బెంగళూరు ప్రధాన రహదారిపైనే ఉంది. ఈ దుకాణం సమీపంలో కొన్ని ఇళ్లు, ఇతర దుకాణాలు ఉన్నాయి. ఈ రోడ్డు మీద రోజూ వేలాది వాహనాలు రేయింబవళ్లు వెళుతుంటాయి. వేలాది మంది ప్రయాణిస్తూ ఉంటారు. రాజంపేట పట్టణంలో ఉన్న నారాయణ సాగర్ పటాకుల అంగడి కడప-తిరుపతి ప్రధాన రహదారిపైనే ఉంది. ఈ రోడ్డు పలు వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. వీరబల్లి మండలంలో ఉన్న మూడు దుకాణాలు రాయచోటి-వీరబల్లి ప్రధాన రోడ్డులోనే ఉన్నాయి. ఈ దుకాణాలలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇటువంటి పేలుడు పదార్థాలు అమ్మే దుకాణాలు జనావాసాలకు దూరంగా ఉండాలి. ప్రజలు నిత్యం తిరిగే ప్రదేశాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. దీనివల్ల ఏదైనా ప్రమాదం జరిగినా పెద్దగా ప్రాణనష్టం ఉండదు.

అనుమతులు ఎలా వచ్చాయో?

సాధారణంగా బాణాసంచా దుకాణాల వంటివి ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతులు అంత సులువుగా రావు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని కొంచెం కఠినమైన నిబంధనలే ఉంటాయి. రెవెన్యూ, పోలీసు శాఖల నివేదికల ఆధారంగానే అనుమతులు వస్తాయి. అయితే రోజూ వేలాది మంది ప్రజలు ప్రయాణించే జాతీయ రహదారిపైన టపాకాయల దుకాణం పెట్టుకోవడానికి అనుమతులు ఎలా వచ్చాయో? అర్థం కాని ప్రశ్న. గతంలో అనుమతులు ఇచ్చారే అనుకున్నా ఇప్పటికీ వాటిని అలాగే కొనసాగించడం విశేషం. ఏదైనా అనుకోని సంఘటన జరిగి ప్రజల ప్రాణాలు పోయేంత వరకు ఈ దుకాణాలు నడుపుకోవడానికి అడ్డంకులు ఉండకపోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ శాఖల్లోని కొందరు ఈ దుకాణాల నుంచి లబ్ధి పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాబట్టే.. జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా టపాకాయల అంగళ్లు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఆ దుకాణాల యజమానులు సైతం.. మమ్మల్ని ఎవరూ ఏమి చేసుకోలేరు. మాకేమీ కాదు.. ఎవరికి ఏం ఇవ్వాలో.. ఇచ్చేస్తున్నాం.. అని బహిరంగంగానే చెబుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి.. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి.. నిర్వహిస్తున్న ఈ దుకాణాలను ఊరికి దూరంగా పెట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


చిన్నమండెం మండల కేంద్రంలో కడప-బెంగళూరు రోడ్డు ఆనుకునే ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణం

ఇంటిని కాపాడుకుంటేనే పండుగ సంతోషం

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి


ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దొంగల నుంచి ఇంటిని కాపాడుకుంటేనే ప్రతి ఇంట్లో దసరా పండుగ సంతోషం నిలుస్తుందని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండుగలు అంటే కుటుంబం, బంధువులతో గడిపే మధురమైన సమయం అని, ఈ సమయంలో మనం నిర్లక్ష్యం చేస్తే దొంగలు ఆ ఆనందాన్ని చెడగొట్టే ప్రమాదం ఉందన్నారు. చాలాసార్లు ప్రజలు పండుగ ఉత్సాహంలో ఇంటిని వదిలి బంధువుల దగ్గరికి వెళ్తారన్నారు. అప్పుడు ఆ ఇల్లు దొంగలకు టార్గెట్ అవుతాయని, ఒక్క చిన్న జాగ్రత్త మరిచినా అది పెద్ద నష్టానికి కారణమవుతుందన్నారు. పండుగ హడావిడిలో తలుపులకు సరిగ్గా తాళం వేయకపోవడం, బయట తాళం వేసి వెళ్లిపోవడం, విలువైన వస్తువులు ఇంట్లో వదిలేయడం ఇలాంటివన్నీ దొంగలకు ఆహ్వానం పలికినట్టేనన్నారు. మీరు ఇంటి వద్ద లేకపోయినా, మీ ఇల్లు సురక్షితంగా ఉందన్న నమ్మకం మీకు ఉండాలంటే ముందుగానే భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంట్లో సీసీ కెమెరాలు, అలార్మ్ సిస్టమ్స్, సెన్సార్ లైట్లు అమర్చుకోవడం వలన అవి దొంగలను భయపెడతాయన్నారు. నగలు, నగదు, ముఖ్యమైన పత్రాలు ఇంట్లో కాకుండా బ్యాంకు లాకర్స్‌లో భద్రపర్చుకోవాలన్నారు. పండుగ రోజుల్లో మీ వాడల్లో, ఊర్లలో జాగ్రత్తగా గమనించి ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దసరా పండుగ సెలవుల్లో జిల్లా ప్రజలు జాగ్రత్తగా ఉంటూ సురక్షితంగా పండుగ జరుపుకోవాలని సూచించారు.

మాసోత్సవాలపై అవగాహన కల్పిద్దాం

● డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య

రాయచోటిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ మాసోత్సవాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ఈనెల 22వ తేదీ నుంచి తగ్గించిన జీఎస్టీపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో సాధారణ, పేద, మధ్య తరగతి ప్రజలకు ఏ విధంగా ప్రయోజనం చేకూరుతుందో అనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 25 నుంచి అక్టోబరు 19వ తేదీ వరకు నాలుగు వారాల పాటు జిల్లా వ్యాప్తంగా శాఖల వారీగా ప్రజల్లో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం గురించి చైతన్యపరిచి ఆర్థికంగా పొదుపు చేసుకోవడంపై జాగృతి చేయాలన్నారు. ఈ నెల 25వ నుంచి 29వ తేదీ వరకు ఇంటింటికి జీఎస్టీ ఫలాలు అనే కార్యక్రమం ద్వారా 30వ నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు వ్యవసాయం, ఉద్యానవనం, ఉపాధి హామీ తదితర వృత్తులపై అవగాహన కల్పించడం, 7 నుంచి 13వ తేదీ వరకు మానవ వనరులు, విద్య, ఆరోగ్యం, అభివృద్ధి సాధికారతపై అవగాహన కల్పించడం, 14 నుంచి 18వ తేదీ వరకు వికాస్ విశ్వాస నమ్మకమైన అభివృద్ధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, సమావేశాలు, క్విజ్ పోటీలు, సెమినార్లు వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

19వ తేదీ జిల్లా స్థాయి, మండల స్థాయిల్లో సామూహిక దీపావళి సంబరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజారోగ్యానికి దోహదం చేసి జీఎస్టీ 2.0 ప్రయోజనంలో లబ్ధి పొంది పొదుపు చేసకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

కామాక్షిదేవి.. కరుణించవమ్మా..

● వీరభద్రాలయంలో కామాక్షిదేవి అలంకారంలో అమ్మవారు ● వైభవంగా దేవీ శరన్నవరాత్రులు


రాయచోటి వీరభద్రాలయంలో కామాక్షిదేవి అలంకారం


లలితా త్రిపురసుందరి దేవిగా గుర్రంకొండ రెడ్డెమ్మ తల్లి


మీనాక్షిదేవి అలంకరణలో రాజంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి


వారాహి అలంకరణలో మదనపల్లె కన్యకాపరమేశ్వరీదేవి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దసరా ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో 6వ రోజు శనివారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు కామాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని గాంధీబజారులో కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు భవానీదేవి అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు. అమ్మవారి ముందు మహిళలు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. రాజంపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మీనాక్షిదేవి అలంకారంలో, నందలూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మీనాక్షి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. మదనపల్లె కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో వారాహి అలంకరణ, మదనపల్లె కోర్టులో గంగమ్మ ఆలయంలో కొబ్బరితో అలంకరణలో గంగమ్మ, లలితా త్రిపురసుందరి దేవిగా గుర్రంకొండ రెడ్డెమ్మ తల్లి, లలితా త్రిపుర సుందరి అలంకరణలో పీలేరు రౌద్రాలమ్మ దర్శనం ఇచ్చారు. ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


లలితా త్రిపుర సుందరిగా పీలేరు రౌద్రాలమ్మ



రాయచోటిలో భవానీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరిదేవి... కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

కోదండరాముడికి స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అధికారి మధు అందజేసిన సుగంధ ద్రవ్యాలను, పట్టువస్త్రాలను, పుష్పాలతో ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్ మూలవిరాట్‌లకు అభిషేకం, పూజలు నిర్వహించారు. పసుపులేటి సుబ్బరాయుడు దంపతులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.


సుగంధ ద్రవ్యాలను తీసుకొస్తున్న ఆలయ అధికారి

జీఎస్టీ తగ్గింపుతో లబ్ధిపై అవగాహన పెంచాలి

● డీపీవో రాధమ్మ


మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు చేకూరే లబ్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ అధికారులకు తెలిపారు. శనివారం సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల వద్ద కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడంతో సామాన్య ప్రజలకు ఆర్థిక భరోసా చేకూరిందని తెలిపారు. తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీని పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు బస్టాండు కిటకిట..




పీలేరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. విద్యాసంస్థలకు సెలవులు రావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, వారాంతం సెలవులు కావడంతో ఐటీ ఉద్యోగులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు బయటి ప్రాంతాల నుంచి పీలేరు బస్టాండుకు చేరుకున్నారు. ప్రధానంగా చిత్తూరు, రాయచోటి, సుండుపల్లె, సదుం మార్గాల్లో రద్దీ నెలకొంది. కొంతమంది కలిసి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా, కొంతమంది ఓపికగా ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూసి బస్సులు రాగానే తమ గమ్యస్థానాలకు వెళ్లారు.

ప్రైవేటుకు పంచాయతీ నిధులు

● వీధి దీపాల పేరుతో రూ.7.50 లక్షలు చెల్లింపు ● నాడు వైసీపీ నేత ఆదేశంతో రియల్ వ్యాపారికి లబ్ధి

సాధారణంగా ఎక్కడైనా పంచాయతీ అనుమతితో నిబంధనల మేరకు ప్రైవేటు వ్యక్తులు, రియల్ వ్యాపారులు లేఅవుట్ వేస్తే.. అక్కడ నివాసాలు ఉంటే విస్తరణలో భాగంగా వీధిలైట్ల ఏర్పాటుకు పంచాయతీ నిధులు వెచ్చించాలి. అది కూడా సింగిల్ వైరు (కండెక్టర్) మాత్రమే లాగాలి. కానీ బసినికొండ పంచాయతీలో వేసిన లేఅవుట్‌లలో ఆ స్థాయిలో నిర్మాణాలూ జరగలేదు. కాపురాలూ లేరు. అయినా సరే వైసీపీకి చెందిన రియల్ వ్యాపారి.. బిల్డర్ అయిన ఓ వ్యక్తి లబ్ధి చేకూర్చే క్రమంలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఆదేశాలతో రూ.7.50లక్షల పంచాయతీ నిధులతో ఇక్కడ విద్యుత్ ఏర్పాటు చేశారు.


బైపాస్‌రోడ్డు సాయిబాబాగుడి ఎదురుగా లేఅవుట్‌లో లాగిన విద్యుత్తు లైన్లు

మదనపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వడ్డించే వాడు మనోడైతే.. బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే అనేలా.. ఇక్కడి అధికారులు వ్యవహరించారు. పంచాయతీలో మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధి లైట్లు, శానిటేషన్ సక్రమంగా లేక ప్రజలు అల్లాడుతుంటే పట్టించుకోని పాలకులు, అధికారులు.. ప్రైవేటు లేవుట్‌లో మాత్రం నిధులు వెచ్చించారు. పన్నుల రూపంలో ప్రజలు పంచాయతీకి చెల్లించిన సొమ్మును వారి సంక్షేమం, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉండగా.. రియల్ ఎస్టేట్ వ్యాపారి అభివృద్ధికి సహకరించి స్వామి భక్తిని చాటుకున్నారు. వందలు కాదు వేలు కాదు.. ఏకంగా లక్షల రూపాయలు వెచ్చించి విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేశారు.

మదనపల్లె మండలంలోని బసినికొండ పంచాయతీ పరిధిలో ఉన్న మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వైపీపీ పాలనలో లేఅవుట్‌లు వేశారు. వీటిని అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరుడు, సన్నిహితుడు ఏర్పాటు వేశారు. ఇందులో బసినికొండ కస్పాలోని పంచాయతీ కార్యాలయం వెనుక వైపున (నిమ్మనపల్లె రోడ్డు నాలుగు కూడలి వద్ద) ఒకటి, బైపాస్ రోడ్డు సాయిబాబా గుడికి ఎదురుగా మరొక వెంచర్ వేశారు. అక్కడి ఒక లేవుట్‌లో ప్లాట్లు అమ్మిందీ లేదు. కస్టమర్లు కొన్నదీ లేదు. రియల్ వ్యాపారే బిల్డర్‌గా నివాసాలు, డూప్లెక్స్ నిర్మాణాలు చేపట్టి కస్టమర్లకు విక్రయిస్తున్నారు. ఇందులో మదనపల్లె-నిమ్మనపల్లె ప్రధాన రహదారి నుంచి లేఅవుట్‌లోని నివాసాల చివరి వరకు త్రీఫేజ్‌లో విద్యుత్తు లైన్ వేశారు. ఇక్కడ తొమ్మిది విద్యుత్ స్తంభాలు, అయిదు వైర్ల చొప్పున కండెక్టర్ లాగారు. ఇందుకోసం బసినికొండ-1 పంచాయతీ నుంచి రూ.3.38 లక్షలు ట్రాన్స్‌కోకు 2023 డిసెంబరు 1వతేదీన చెల్లించారు. ఇక్కడ రెండు మూడు గృహాల్లో మాత్రమే నివాసాలు ఉండగా, మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. నివాసం ఉన్నవి కూడా డూప్లెక్సు సంపన్నులు ఉండేవి. ఇలాంటి లేవుట్‌లో వీధి దీపాల ఏర్పాటు పేరుతో పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్ములు అర్పించారు. సాయిబాబా గుడికి ఎదురుగా ఉన్న మరో వెంచర్‌లోనూ ఇలాగే చెల్లించారు. అక్కడ ట్రాన్స్‌పార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలు, త్రీఫేజ్ లైన్ కోసం రూ.4 లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇలా రెండు ఏరియాలలో రూ.7.50 లక్షలకుపైగా అత్త సొత్తు అల్లుడి దానం అన్నట్లు వెచ్చించారు.

నిబంధనలకు విరుద్ధంగా..

బైపాస్‌రోడ్డు నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న ఈ లేఅవుట్ బసినికొండ-2 పరిధిలోకి వస్తుంది. కానీ బసినికొండ-1 నుంచి నిధులు వెచ్చించారు. అదీ వైసీపీలోని అడ్డదిడ్డ పాలన. వీరిని ఎవరూ అడిగే వారే లేరు. అడిగినా సమాధానం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వారి ఇష్టానుసారం చేసేశారు. ఎక్కడ అనుకూలమో, ఎక్కడ తాముకాలితో చెబితే, చేత్తో చేస్తారో అలాంటి వారి నుంచే చేయించారు. రియల్, బిల్డర్‌గా ఉంటున్న వైసీపీ నేతకు ఆర్థిక లబ్ధి చేకూర్చారు.

స్థానికుల ఆగ్రహం

బసినికొండ పంచాయతీ పట్టణ శివారు ప్రాంతంలో విస్తరించి, పట్టణంలో కలసిపోయింది. అయితే పట్టణ స్థాయిలో వసతులు, సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే, రియల్‌వ్యాపారి లేఅవుట్‌లో పంచాయతీ నిధులు ఖర్చు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా పంచాయతీలో కొత్తగా లేఅవుట్ వేస్తే, అక్కడి నుంచి పన్నులతో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టాలే కానీ.. నివాసాలు లేని చోట నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయడం ఏంటనేది అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. దీనిపై డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పంచాయతీ నిధులు ప్రైవేటు లేఅవుట్‌లలో ఖర్చు చేయకూడదని అన్నారు. వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



బసినికొండలోని రియల్ వ్యాపారి లేఅవుట్‌లో విద్యుత్తు లైన్ - రామాచార్లపల్లె సమీపంలోని లేవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

మళ్లీ ఆలస్యంగా ఏడుకొండలు రైలు



ములకలచెరువు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడుకొండలు సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం కూడా తీవ్ర ఆలస్యంగా నడిచింది. ఈ మార్గంలో వారానికి రెండుసార్లు నడిచే ఏడుకొండలు రైలు ఈనెల 24వ తేదీ ఐదున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచిన విషయం విదితమే. ఈ రైలు శనివారం కూడా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక కారణాలతో రైలు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ఆలస్యంగా బయలు దేరింది. ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 6.26 గంటలకు వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు చేరాల్సిన రైలు ఉదయం 9 గంటలకు వెళ్లింది.

గుంటూరు-ధర్మవరం మధ్య రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సత్యసాయిబాబా 100వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గుంటూరు నుంచి ధర్మవరం, ధర్మవరం నుంచి గుంటూరుకు రెండు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జంక్షన్ నుంచి ధర్మవరం జంక్షన్‌కు (రైలు నెంబర్ 17261) అక్టోబరు 1వ తేదీ నుంచి నవంబరు 30 వ తేదీ వరకు ప్రత్యేక రైలు నడుస్తుంది. అలాగే ధర్మవరం జంక్షన్ నుంచి గుంటూరు జంక్షన్‌కు (రైలు నెంబర్ 17262) అక్టోబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు మరో రైలు నడుస్తుంది. ఈ రెండు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు గుంటూరు జంక్షన్, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపుర్ రోడ్, కంబం, గిద్దలూరు, నంద్యాల, బలనగనపల్లె, కోవెలకుంట, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె రోడ్, ములకలచెరువు, కదిరి, ధర్మవరం రైల్వేస్టేషన్లలో ఆగుతాయి.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


నాగేంద్ర మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు నాగేంద్ర (37) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, కొండామారిపల్లె గ్రామంలోని తట్టివారిపల్లెకు చెందిన శేషయ్య కుమారుడు నాగేంద్ర అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నట్లు తెలిపారు. కాగా ఉన్న ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందాడన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోర్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికిలోని శవపరీక్ష గదికి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం ... కేసు నమోదు


శ్రీకాంత్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వ్యక్తి ఆదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండ్‌లో గాయత్రి మెడికల్ షాపు నిర్వహిస్తున్న శ్రీకాంత్ (58) శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు బెంగళూరు రోడ్డు సమీపంలో హంద్రీ-నీవా కాలువ గట్టున స్కూటీ, చెప్పులు ఉన్నట్లు గుర్తించామన్నారు. కాగా కాలువ, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెదికినా ఏమీ లభ్యం కాలేదని చెప్పారు. మృతుడికి భార్య గాయత్రి, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

జాక్‌పాట్ విధానంపై ఏడీఎం విచారణ

గుర్రంకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంపై మార్కెట్ శాఖ ఏడీఎం త్యాగరాజు విచారణ చేపట్టారు. ఈనెల 2వ తేదీ రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్ నాయుడు జాక్‌పాట్ విధానంతో వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఏడీఎం శనివారం గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం, అధిక కమీషన్లపై రైతులతో మాట్లాడారు. రైతుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం మార్కెట్ యార్డులో టమోటా వేలం పరిశీలించారు. మార్కెట్ యార్డులో ఈ-నామ్ అమలు సరిగా లేదంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణితో పాటు నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల మండల స్థాయి సిబ్బందితో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, విద్య, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖలతో తదితర అంశాలపై కలెక్టర్ నిశాంత్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలు 15 రోజులకు ఒకసారి తాగునీటి వనరులను తనిఖీ చేయాలన్నారు. ట్యాంకులపై సరైన కవర్లు ఉండాలని లేకుంటే పక్షులు, ఎలుకలు, చెత్త వంటి పదార్థాలు నీటిలో పడే ప్రమాదం ఉందన్నారు. ట్యాంకులు శుభ్రపరచే పనులు రెగ్యులర్‌గా చేయాలన్నారు. ఈ వారం చివరికల్లా అన్ని ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కలిసి నివేదిక ఇవ్వాలని, పైప్‌లైన్‌లు ఎక్కడా డ్రైనేజ్ పక్కన లేకుండా ట్యాంకులకు మూత ఉండాలన్నారు.

పశువుల వ్యాధుల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మండల ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మయ్యా... దాహం తీరింది...


బాటిల్ మూత వచ్చింది... ఇలా తాగేద్దాం

వాల్మీకిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఎండ మండిపోతున్న వేళ ఓ వానరం వాటర్ బాటిల్‌లోని నీరు తాగి తన దాహార్తిని తీర్చుకుంది. కొత్తపేట వీధిలోని గ్రామీణ బ్యాంకు సమీపాన ఓ ఇంటర్నెట్ దుకాణంలోకి వెళ్లిన వానరం అక్కడ ఉన్న ఓ వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లి గోడమీద కూర్చుని దాని మూతను తీసేందుకు నానా తంటాలు పడింది. ఎలాగోలా బాటిల్ మూతను తొలగించి అందులోని నీటితో దాహం తీర్చుకోవడమే కాక నీటిని ముఖంపై పోసుకుని ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందింది.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుండుపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్, సీనియర్ మెన్ రాష్ట్ర స్థాయి పోటీలకు సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పుల్లంపేటలో జరిగిన సబ్ జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్ల ఎంపికల్లో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు అభి, బాలికల విభాగంలో సంధ్య రాష్ట్ర పరిశీలకుల దృష్టిని ఆకర్షించారు. సీనియర్ మెన్ విభాగంలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు కార్తీక్, ఆంజనేయులు జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారని ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు. సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి పోటీలు అక్టోబరు 4, 5, 6 తేదీల్లో శ్రీకాకుళంలో, సీనియర్ మెన్ పోటీలు నవంబరులో గుంటూరులో జరుగుతాయి.

ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

పుల్లంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని ఆదర్శ పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో 8 మంది ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో రిషిత్, నితీష్, ప్రతాప్, బాలికల విభాగంలో అఖిల, పుష్పలత, సుశాంతి, కార్తీక, తన్విక అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ నీలకంఠ రావు, ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి తెలిపారు.

రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్


అధికారులు సీజ్ చేసిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారుల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక ఎక్స్‌కవేటర్, రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని మదనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వాహనాల యజమానికి జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

డీఎస్సీ నియామకంపై సంబరాలు




నాయకుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పీలేరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలు పూర్తయిన సందర్భంగా పీలేరులోని ఏపీసీపీఎస్ఈఏ, ఎన్‌టీఏ నేతలు శనివారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేశ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లోనే విజయవంతంగా డీఎస్సీ నిర్వహించి, దాదాపు 16 వేల మందికి నియామకపత్రాలు అందజేసినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

రాష్ట్రంలోని ఉద్యోగులందరూ వేయి కళ్లతో ఎదురుచూస్తున్న డీఏలపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని, పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక అందించేలోపు మధ్యంతర భృతిని ప్రకటించాలని, తద్వారా ఉద్యోగులు దసరా, దీపావళి పండుగలను సంతోషంగా చేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, అమరనాథ్, మస్తాన్, సుబ్రహ్మణ్యం, దర్మయ్య, శివశంకర్, జనార్దన్‌రెడ్డి, జయరాం, వేణుగోపాల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్లుగా నిరీక్షణ

- ● జెడ్‌హెచ్‌డీసీ భూముల పట్టాలకు ఇంకెన్నాళ్లు....?
- ● ఏక్ సాల్ పర్మిషన్లతో ప్రభుత్వ లబ్ధికి దూరం
- ● సంబేపల్లె తప్ప అన్ని మండలాల్లో పట్టాలు పంపిణీ
- ● కూటమి ప్రభుత్వంపైనే దళిత రైతుల ఆశలు


GOVERNMENT OF ANDHRA PRADESH
REVENUE (RSR.III) DEPARTMENT

Memo.No.26/Ser.III(2)/2015 Dt: 09.03.2015

Sub:-PS- Representation of Sri J. Venkataswamy and others of Prakashnagar colony of Sambepalli(M), YSR Kadapa district for issue of D.form Patta and JTB - Reg.

Ref:-Representation, dt.nil of Sri J. Venkataswamy and others of Kadapa.

***

A copy of the reference cited is sent herewith to the District Collector, YSR Kadapa. He is requested to take necessary action in the matter as per rules in force.

M. BHASKAR
DEPUTY SECRETARY TO GOVERNMENT

The District Collector, YSR Kadapa(we).
SF/SC.

COLLECTOR'S OFFICE KADAPA 23 FEB 2015

2015లో చీఫ్ సెక్రటరీ ఇచ్చిన ఉత్తర్వులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జెడ్‌హెచ్‌డీసీ భూముల పట్టాల కోసం 5, 10, 15 ఏళ్ల కాదు ఏకంగా 40 సంవత్సరాలుగా దళిత రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామం సర్వే నెంబర్-430లో 110 ఎకరాలు, మోటకట్ల గ్రామం సర్వే నెంబర్-831లో 159 ఎకరాలు పొలం జెడ్‌హెచ్‌డీసీ కింద ఉంది. ఈ భూముల్లో పంటలు పండించేది రైతులు. దానిపై పెత్తనం మాత్రం జిల్లా హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులది. ఈ భూములకు సంబంధించి ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన 154 మంది దళిత రైతులు పట్టాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. 1985 నుంచి ప్రతి యేటా ఏడాదికి 75 రూపాయలు రుసుం చెల్లించి రైతులకు ఏక్ సాల్ పర్మిషన్‌తో పొలాలు సాగు చేసుకుంటున్నారు. పంటసాగు చేసి రైతుల పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి లబ్ధి రైతులకు మాత్రం రావడం లేదు. రైతులకు పట్టాలు లేవు, పాస్‌బుక్కులు లేవు. దీంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు రావడం లేదు. నష్టం వచ్చినా, కష్టం వచ్చినా ఫలితం మాత్రం రైతులకు దక్కడం లేదు. ఏళ్ల తరబడి దళిత రైతుల నిరీక్షణ తప్పడం లేదు.

ఆ భూములపై 2015 నుంచి అధికారుల ప్రతిపాదనలు

జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి పట్టాల కోసం శివవెంకటస్వామి ఫిర్యాదు మేరకు 2015లో చీఫ్ సెక్రటరీ అప్పటి జిల్లా కలెక్టర్‌కు పట్టాలు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. అయితే పట్టాలు అప్పట్లో ఇవ్వలేదు. 2017లో అప్పటి కడప ఉమ్మడి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ జిల్లాలో 13 మండలాలకు సంబంధించి జెడ్‌హెచ్‌డీసీ భూములు ఉన్నాయని, 1538 మంది రైతులకు సంబంధించి 2906.74 ఎకరాలు సంబంధించి పట్టాల కోసం ప్రతిపాదలను సిద్ధం చేసి పంపారు. అయితే జిల్లాలో సంబేపల్లె తప్ప మిగిలిన అన్ని మండలాల్లో జెడ్‌హెచ్‌డీసీ భూములను దళిత రైతులకు పట్టాలు అందజేశారు. ఇప్పటికీ సంబేపల్లెకు చెందిన రైతులు మాత్రం పట్టాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. సంబేపల్లె, పెండ్లిమర్రి, వల్లూరు, ఖాజీపేట, కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట, నందలూరు, అట్లూరు, గోపవరం, పోరుమామిళ్ల, మైదుకూరులలో జెడ్‌హెచ్‌డీసీ భూములు ఉన్నాయి.

కాలువకు పోయిన జెడ్‌హెచ్‌డీసీ భూములు

సంబేపల్లె మండలానికి సంబంధించి జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో 2017లో మండిపల్లి నాగిరెడ్డి రిజర్వాయర్ సబ్ కెనాల్ కాలువలకు ఈ భూములు పోయాయి. జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అప్పట్లో ఎస్సీ కార్పొరేషన్ వారికి పరిహారం కింద 54 లక్షల 58 వేల 104 రూపాయల పరిహారం మంజూరు అయినట్లు ఉత్తర్వులు పంపారు. దీనికి సంబంధించిన డబ్బులు మాత్రం రైతులకు అందలేదు. ఈ భూములకు సంబంధించి కొలతలు వేసి సర్వేలు చేసి ఫైలు సిద్ధం చేశారు. పట్టాలు మాత్రం రాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా దళిత రైతుల పట్టాలు అందించాలని కోరారు.

సంబేపల్లె మండలంలోని జెడ్‌హెచ్‌డీసీ భూమి



భూములపై హక్కు కల్పించాలి



40 ఏళ్లుగా ఈ భూములపై పోరాటం చేస్తున్నా. ఇప్పటికైనా ఈ భూములపై హక్కు కల్పించాలి. పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు ఏమీ అందడం లేదు. పర్మిషన్ పేరుతో మా గొంతు కోస్తున్నారు. ఇప్పటికైనా విముక్తి కల్పించాలి. పట్టాలు ఇచ్చి పుణ్యం కట్టుకోవాలి.

- శివవెంకటస్వామి, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



భూములకు కొలతలు వేశారు. ఫైలు సిద్ధం చేశారు. అయినా పట్టా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొని ఉన్నాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు పొందాలంటే పట్టా, పాసుబుక్కు ఉండాలి. ఇవి కల్పించి సాయం చేసి ఆదుకోవాలి.

- సుబ్బన్న, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

పోషణ మాసం... ఆరోగ్యమే లక్ష్యం

జిల్లాలో అంగన్వాడీల కార్యక్రమం

కడప ఎన్జీఆర్ సర్కిల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రకరకాల సమస్యలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు బాలింతలు తగిన జాగ్రత్తలు వహిస్తే తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. రక్తహీనత, బలం లేకపోవడం వల్ల కొంత వరకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అదే విధంగా నీరసం, వంటి సమస్యలతో వయసుతో సంబంధం లేకుండా అనేక మంది బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్త్రీశిశు సంక్షమశాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16 వరకు రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవం 2025ను నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఉన్న 2212 మెయిన్ అంగన్వాడీ కేంద్రాల్లో 177 మినీ అంగన్వాడీ కేంద్రాల్లో 11,267 మంది గర్భిణులు, 12,821 మంది బాలింతలు 56,340 మంది 3 నుంచి 6 సంవత్సరాల్లో పిల్లలకు తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు.


సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

నెల రోజుల్లో కార్యక్రమాలు

అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో బలాన్నిచ్చే వంటకాల తయారీ, తక్కువ ధరకు లభించే పండ్ల పోషణ విలువలు వివరిస్తున్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు బరికెలు తదితర తృణధాన్యాలతో వంటకాలు ఎలా తయారు చేయాలో మహిళలకు కార్యకర్తలు వివరిస్తున్నారు. పోషకాహార తయారీపై పోటీలు నిర్వహించడం జరుగుతోంది. అదే సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాల ప్రాధాన్యత అను బంధ ఆహారంపై వివరిస్తున్నారు. కథలు, బొమ్మల ద్వారా తల్లి దండ్రులకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆహారం వండేటప్పు డు పోషకాలు నష్టపోకుండా తగిన మోతాదులో ఎలా తయా రు చేయాలో చేసి చూపించడం జరుగుతోంది. అంగన్వాడీ కేంద్రాల్లో గ్రామల్లోని బహిరంగ ప్రదేశాల్లో న్యూట్రిషన్లతో పోషకాహారం చేయించి ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. వయసుల వారీగా చిన్నారులు ఎంత మోతాదులో ఆహారం తీసుకోవాలో సూచిస్తున్నారు. స్థూలకాయ నివారణకు చక్కెర, నూనె వినియోగం ఏ విధంగా వాడాలో వివరిస్తున్నారు. తల్లుల ఆధర్యంలో పోషణపై ప్రతిజ్ఞ, పిల్లలకు అపార్ ఆబా ఐడీల నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు.

పోషకాహారం పక్కాగా నిర్వహించేందుకు చర్యలు



పోషకాహార మాసోత్సవాలను అన్ని అంగ న్వాడీ కేంద్రాల్లో పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోషకాహారంపై ప్రదర్శనలు నిర్వహించి తల్లులకు అర్థమ య్యేలా చెప్పాలని సిబ్బందికి సూచించాం. కార్యక్రమం అక్టోబరు 16 వరకు నిర్వహిం చడం జరుగుతుంది.

-రమాదేవి, పీడీ, ఐసీడీఎస్


కమలాపురంలో నిర్వహించిన పోషకాహార ప్రదర్శన (ఫైల్)

గండికోట, రాజోలి సమస్యలు పరిష్కరించాలి

● మరోసారి అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే ఆది


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి) గండికోట ప్రాజెక్టు, రాజోలి ఆనకట్ట సమస్యలను పరిష్కరించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారా యణరెడ్డి శనివారం మరోసారి అసెం బ్లీలో గళం విప్పారు. ఈ రెండిటిపైనా ఈనెల 19న అసెంబ్లీలో మాట్లాడిన ఆయన, తిరిగి వాటి గురించి అసెం బ్లీలో లేవనెత్తారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు అందాల్సిన రూ.460 కోట్ల పరిహారం గురించి మంత్రి నిమ్మల రామనాయుడు, నీటిపారుదల సెక్రటరీ సాయిప్రసాద్‌తో కలిసి ఎన్నిసార్లు అడిగి నా సమస్య అడుగునే ఉందని, ఆర్థికశాఖ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే సభదృష్టికి తీసుకెళ్లారు. కుందూనదిపై రాజోలి ఆనకట్టను మూడు టీఎంసీలతో నిర్మించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ జీవో ఇచ్చారన్నారు. దీనివల్ల రైతులు భూములు అమ్మ కుండా, కొనుకుండా బ్లాక్ చేశారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆనకట్టను నిర్మించాలని, లేదా గత జగన్ ప్రభుత్వం జారీచేసిన జీవోను రద్దు చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోరారు.

అలగనూరు మరమ్మతులతో కేసీ రైతులకు మేలు

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పుట్టా


అసెంబ్లీలో రైతు సమస్యలను ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): అలగనూరు రిజర్వాయర్ మర మ్మతులతో కేసీ రైతులు క్షామం నుంచి క్షేమం వైపు పయనిస్తారని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. 8వ రోజు జరి గిన అసెంబ్లీ సమావేశాల సంద ర్భంగా కేసీ కెనాల్ రైతుల సమ స్యలను ఆయన ప్రస్తావించారు. 92 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న కేసీ కెనాల్ రైతుల ఇరు కారు పంట ఆకాంక్ష నెరవేరేందుకు కేసీ కెనాల్‌కు అనుసంధానంగా సుమారు 3 టీఎం సీల నీటి నిల్వ సామర్థ్య ఉన్న అలగ నూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మరమ్మతులు చేస్తే 250 కోట్ల రూపా యల ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. ఇందుకు కేవలం రూ.36 కోట్లు వెచ్చిస్తే సరిపోతుం దన్నారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమయ్యే నిధులను మంజూరు చేసి కేసీ కెనాల్ రైతులను ఆదుకో వాలని శాసనసభ ద్వారా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

వైవీయూ వలంటీర్లకు అరుదైన అవకాశం

  
బి.ఈశ్వర్, బి.నవీన్, నీలమహేశ్వరి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వెస్ట్ జోన్ ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్‌కు ఎంపికయ్యారు. బి.ఈశ్వర్ (వైవీయూ), బి.నవీన్ (ప్రభు త్వ డిగ్రీకళాశాల, మైదుకూరు), పి.నీలమహేశ్వరి (ప్రభుత్వ డిగ్రీ కళా శాల, కడప) గుజరాత్‌లో జరిగే శిబిరానికి హాజరవుతున్నారు. శిబి రంలో ప్రతిభ కనబరిస్తే 2026 జనవరిలో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కనుం ది. ఈసందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజి స్ట్రార్ పి.పద్మ, సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి, వలంటీ ర్లను అభినందించారు.

విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు

● నెలాఖరులోగా పంట నమోదు పూర్తి కావాలి

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి సతీష్


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్

పులివెందుల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ సిబ్బందిని హెచ్చరించారు. శని వారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఉద్యాన శాఖ, రాష్ట్ర సూక్ష్మ సాగునీటి పథకం వారి ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ లింగాల, వేముల మండలాల్లో పంట నమోదుకు శాతాన్ని ఆర్ఎస్‌కేల వారీగా పరిశీలించారు. కొన్నిచోట్ల పంట నమోదు శాతం తక్కువగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు నెలలు అవుతున్న పంట నమోదు పూర్తికాకపోవడం ఏమిటని మందలించారు. ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉందని, పూర్తిచేయాల్సిందే అన్నారు. గైర్హాజరైన వారి గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యాన పంటలు నాటుకునే రైతు లకు దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, నేరేడు వంటి పంట లకు రాయితీ ఉంటుందన్నారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులుకు చేపట్టాల్సిన నివారణ చర్యలను సిబ్బందికి వివరించారు. అనంతరం ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్ అందాలన్నారు. ఆర్ఎస్‌కేల వారీగా ఇచ్చిన లక్ష్యా లను పూర్తి చేయాలన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతు లకు వందశాతం రాయితీతో రూ.2.18 లక్షలు, చిన్న, సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.2.18లక్షల వరకు రాయితీ అందజేస్తారన్నారు. 5 నుంచి 10 ఎకరాల పైన ఉన్నరైతు లకు 50శాతం రాయితీతో రూ.4లక్షల వరకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. డ్రిప్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పులివెందుల ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి, వేముల, లింగాల మండ లాల ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్ 19 బ్యాడ్మింటన్ (షటిల్)కు బాలబాలికలు ఎంపిక



కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ రెండో విడత క్రీడల ఎంపికల్లో భాగంగా శనివారం కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్ 19 బ్యాడ్మింటన్ (షటిల్) క్రీడాపోటీల్లో జిల్లా నలుమూలల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో జి.పూజిత, ఎస్.శృతిక, జె.మునీగీతిక, వై.నాగమౌనిక, జీకే సంకీర్తన, స్టాండ్ బైగా వీ.పౌర్ణిమ, సి.రీనా, బాలుర విభాగంలో ఎ.సాయి నవ్‌నీత్ దత్త, సి.త్రివిక్రం, ఎస్.ఇస్మాయిల్, పవన్‌రెడ్డి, అభినవ్, స్టాండ్‌బైగా ఏవీ సాయి సంతోష్, జె.దినేష్‌లు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ అండర్ 19 ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి చంద్రమోహన్‌రాజులు వెల్లడించారు.

కడప ఆర్ట్స్ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 2025-26 విద్యా సంవత్స రానికి డిగ్రీ మొదటి సంవత్సరం కోర్సుల రెండో విడత ప్రవేశాలకు సెప్టెంబరు 26 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీ.కాం, బీఎస్సీ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెండో విడత వెబ్ ఆప్షన్ల నమోదు సెప్టెంబరు 29న మొదలవుతుందని, విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మాదకద్రవ్యాల వినియోగంతో కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నం


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

చెన్నూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను ఎవరు వినియో గించినా వారి కుటుంబ వ్యవస్థ చిన్నా భిన్నం అవుతుందని డీఆర్‌డీఏ పీడీ రాజ్య లక్ష్మి అన్నారు. చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం మాదక ద్రవ్యాల వినియోగం, వాటివల్ల కలిగే అనర్థాలపై గ్రామ సమాఖ్య సభ్యు లతో సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల విని యోగంపై అత్యంత కఠినంగా వ్యవహరి స్తోందన్నారు. ఈగల్‌టీం ఏర్పాటు చేసి గంజాయి లాంటి మత్తు పదార్థాలను యువత తీసుకోకుండా పూర్తిస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంద న్నారు. ఇందుకోసం సమాజంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. తాత్కాలిక ఆనందం కోసం యువత మత్తుపదార్థాలకు బానిస అయితే చేజే తులారా భవిష్యత్తు నాశనం చేసుకున్న ట్లేనని తెలిపారు.

ఈనెల 22 నుంచి కేంద్రం జీఎస్టీని తగ్గించిందని, తద్వారా ఎన్నోరకాల విని యోగకరమైన వస్తువులపై ధరలు తగ్గా యన్నారు. ఒకవేళ పూర్వపు ధరలే ఉంటే ఆ విషయం అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్ర మంలో ఏపీయం వెంకటేశ్, సీసీ నారాయణరెడ్డి, వీవోఏలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కడప క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ ఆసుపత్రి సమీపంలో యువకుడు మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా డోన్‌కు చెంది న మురహరి కుమార్ (35) చిన్న చిన్న కూలీ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావ డంతో మనస్తాపం చెంది శనివారం రిమ్స్ సమీపంలో మాత్రలు వేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచా రిస్తున్నట్లు తెలిపారు.

ప్రాంతీయ జీవనశైలికి ప్రతిరూపంగా భూమిపూజ కథనం



అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వేంపల్లె గంగాధర్

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సాహితీ సదస్సులో కడప జిల్లా ప్రతినిధి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వేంపల్లె గంగాధర్ పాల్గొన్నారు. శనివారం సాయంత్రం జరిగిన విభిన్న భాషల కథా సదస్సులో రాయలసీమ గ్రామీణ జీవనాన్ని సజీవంగా చిత్రించిన భూమి పూజ కథను ఆయన సమర్పించారు. ఈ కథ ద్వారా ప్రాంతీయ జీవనశైలి, సంస్కృతి, వ్యక్తిత్వాలను స్పష్టంగా ప్రతిబింబింప జేశారు. దేశీయ, అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక ప్రతిభలతో కూడిన ఈ సదస్సు రచయితలు, కళాకారుల మధ్య సృజనాత్మక చర్చ లకు వేదికగా మారింది.


వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వంది ప్రజలే

● స్థానిక ఎన్నికల్లో కూటమి స్వీప్ చేస్తుంది

● శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్


హార్సిలీహిల్స్‌లో విలేకరులతో మాట్లాడుతున్న షరీఫ్

బి.కొత్తకోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు దుష్ట పాలనతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వైసీపీకి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా లేకుండా చేసింది రాష్ట్ర ప్రజలేనని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహా రాల సలహాదారు షరీఫ్ తెలిపారు. హార్సిలీహిల్స్‌లో శనివారం పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభు త్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. జగన్ హయాంలో ముందుచూపు, రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి కేవలం మెప్పు కోసం బటన్లు నొక్కి రాష్ట్రం రూ.లక్ష కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశాడన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు క్లీన్‌స్వీప్ చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు మెడికల్ కాలేజీల్లో సీట్లు అమ్ముకుని లాభపడాలని చూశారని, ప్రభుత్వం రాకపోయే సరికి పీపీపీ విధానంపై బురద జల్లుతున్నారన్నారు. ప్రస్తుతం తమ భూము లను లాక్కుంటారు, స్థలాలను కబ్జా చేస్తారు, అక్రమ కేసులు పెడతారు, వెంచర్లలో వాటాలు అడుగుతారనే భయాలు లేకుండా రైతులు, వ్యాపారులు, ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నా రన్నారు. టూరిజం అభివృద్ధికి చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నా రని హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక నిధుల కేటాయింపు జరుగుతుంద న్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం హజ్‌యాత్ర, దుల్హన్ లాంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరిం చారు. అంతకు ముందు తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవ ర్గాల ముస్లిం మైనార్టీ నేతలు ఆయనకు సాదరస్వాగతం పలికి పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, ఎస్ఏ మస్తాన్, రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్, తంబళ్లపల్లె టీడీపీ నేతలు అయూబ్‌బాషా, సికిందర్ ఆజం, ఎండీ మస్తాన్, సాజిద్ బాష, లతీఫ్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవంబరు 2న జానమద్ది సాహితీ పీఠం పురస్కారాల ప్రదానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీ వేత్త బ్రౌన్‌శాస్త్రి జానమద్ది శతజయంతి సందర్భంగా జానమద్ది సాహి తీ పీఠం పురస్కారాల ప్రదానోత్సవం నవంబరు 2న మధ్యాహ్నం 2 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో జరగనుందని జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్ట్ విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జ్యోతిర్మయి వెంకటప్రతాప్ హాజరవుతా రన్నారు. సాయంత్రం అన్నమయ్య కీర్తనల కచేరి, అనంతరం సాహి త్య ప్రసంగాలు జరుగుతాయని తెలిపారు.

సుబ్బిరెడ్డి ఆత్మహత్యకు కారకులైన నిందితులను అరెస్టు చేయాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నెపల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డిని వేధించి ఆత్మహత్య చేసుకునేలా చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సీఆర్వీ ప్రసాద్ అధ్యక్షతన శనివారం ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వవిహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ (జేసీఐపీ) జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర నాయకుడు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సత్తార్, సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకుడు ఓబ య్య మాట్లాడారు. సుబ్బిరెడ్డి ఆత్మహత్య విషయంపై అప్పటి ఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చి ఇప్పటికి 50రోజులవుతున్నా ఇంత వరకు దోషులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైసీపీ రైతు సంఘం నగర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, లోక్‌సత్తా జిల్లా కార్యదర్శి దేవర శ్రీకృష్ణ, వైహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసులు, ఆర్ఎస్ఎఫ్‌రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో విద్యార్థిని కిడ్నాప్

● పట్టుకున్న పోలీసులు ● నలుగురిపై కేసు నమోదు

కడప క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రోడ్డు లోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఇంజనీరింగ్ విద్యార్థినిని కారులో బలవంతంగా ఎక్కించుకుని పారిపోయారు. దీంతో ఆ యువతి తల్లి గట్టిగా కేకలు వేయడంతో అక్కడున్న వారు సీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బాలమద్దిలేటి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముద్దనూరు మండలం బొందలకుంట గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్‌గా, కిడ్నాప్ చేసి యువతిని తీసుకెళ్లిన కారు నెంబరు గుర్తించారు. సీఐ బాలమద్దిలేటి ఇటు వేంపల్లె, కమలాపురం, ఎర్రగుంట్ల పోలీ సులను అలర్ట్ చేశారు. దీంతో ఎర్రగుంట్లలో కిడ్నాపర్‌ను అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. సీఐ బాలమద్దిలేటి వివరాల మేరకు.. తొండూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన యువతి పులివెందుల రోడ్డులోని ఇంజనీరింగ్ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు కావడంతో తన కుమార్తెను తీసుకెళ్లేందుకు కాలేజీ వద్దకు వచ్చింది. తల్లీ కూతు రు ఊరికి వెళ్లేందుకు బస్టాపు వద్ద ఉండగా పవన్‌కళ్యాణ్, అతని సోదరుడు రాజేశ్, అరవింద్, సురేంద్రలతో కలిసి కారు లో అక్కడకి వచ్చారు. ఆ యువతిని బలవంతంగా కారులో ఎక్కించే ప్రయత్నం చేయగా తల్లి అడ్డుపడింది. దీంతో వారు ఆమెను కిందకు తోసివేసి కారులో ఎక్కించుకుని పరారీ అయి నట్లు తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు పవన్‌కల్యాణ్, అతని తమ్ముడు రాజేశ్, స్నేహితులు అరవింద్, సురేంద్రలపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధికుక్కల దాడి.... 30 మేకపిల్లలు మృతి


మృతి చెందిన మేకపిల్లలు


బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ముడుమాల పంచాయతీ జౌకుపల్లె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వీధికుక్కలు దాడి చేయడంతో 30 మేకపిల్లలు మృతి చెందాయి. జాలా ప్రసాద్ అనే వ్యక్తి మేకపిల్లలను పెంచుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. వీధికుక్కలు ఒక్కసారిగా మేక పిల్లలపై దాడిచేసి చంపేశాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశా రు. దీంతో తాను తీవ్రంగా నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.-


రైల్వేకోడూరు: గజలక్ష్మిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



రామాపురం: గజలక్ష్మిగా దర్గా మాతాజీ


ఒంటిమిట్ట: త్రిపురసుందరి అలంకారంలో వాసవి


రాజంపేట: అన్నపూర్ణగా చౌడేశ్వరి


లలితా త్రిపుర సుందరిగా వీరబల్లి గంగమ్మ


సుండుపల్లె: లలితాంబగా కన్యకాపరమేశ్వరి


చిట్వేలి: లలితాదేవిగా భద్రకాళి అమ్మవారు

జయ జయహే.. మధుసూదన కామిని..

జయజయ దుర్గతి నాశిని కామిని సర్వఫల సశాస్త్రమయే..
రాథగజ తురగపదాతి సమవృత పరిజన మండిత లోకనుతే..
హరిహరబ్రహ్మ సుపూజిత సేవిత తాప నివారిత పాదయుతే..
జయజయహే.. మధుసూదన కామిని
జయలక్ష్మి జయ పాలయమాం..!

శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా శనివారం అన్ని ప్రాంతాల్లో భక్తులు జగన్మాతను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు.

రైల్వేకోడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో పంచామృతాభిషేకం, మహన్యాస రుద్రాభిషేకం, దేవీ భాగవత పారాయణం, నవావరణ, సువాసిని పూజలు నిర్వహించారు. అర్చకుడు శరవణ, ఆలయ కమిటీ చైర్మన్ గునిశెట్టి రమేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: నీలకంఠ్రావుపేట పంచాయతీలోని దర్బారు సాయి నగర్‌లో దర్గా మాతాజీ గజలక్ష్మిగా దర్శనమిచ్చారు.
లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో సర్వమంగళాదేవి శనివారం లలితాంబిక అలంకారంలో దర్శనం ఇచ్చారు.
రాయచోటి-నేతాజీ సర్కిల్ : పట్టణంలోని ఉమామహేశ్వరా లయంలో ఉమాదేవి రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. వేదపండితులు నటరాజస్వామి, ఆలయ నిర్వాహకులు శివగంగిరెడ్డి ఏర్పాట్లు చేశారు
రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, సాధు కామాక్షమ్మ ఆలయాల్లో అమ్మవారు మీనాక్షిగా, చౌడేశ్వరి ఆలయంలో విజయలక్ష్మిగా , ఉదయగిరి యల్లమ్మ ఆలయంలో కాత్యాయనిగా, వెంకటరాజంపేట కనకదుర్గ మహేశ్వర ఆలయంలో అన్నపూర్ణగా దర్శనమిచ్చారు.
సుండుపల్లె: మండలకేంద్రంలో వాసవి లలితాదేవిగా దర్శనమిచ్చారు.
నందలూరు : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మీనాక్షి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశ్రేష్ఠి, సెక్రటరీ గెలివి నాగసురేంద్రకుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.
చిట్వేలి : స్థానిక వీరభద్రాలయంలో భద్రకాళి అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
వీరబల్లి: మండల కేంద్రంలో గంగమ్మ లలితా త్రిపుర సుందరిగా దర్శనం ఇచ్చారు.
ఒంటిమిట్ట : మండల కేంద్రంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు త్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు, తుమ్మలపెంట శ్రీనివాసులు, హరికృష్ణ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.
రాయచోటిటౌన్: పట్టణంలోని వీరభద్రాలయంలో అమ్మవారు కామాక్షి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గాంధీబజారులో కన్యకాపరమేశ్వరి భవానిగా, చౌడేశ్వరి ఆలయంలో అన్నపూర్ణగా, ఉమామహేశ్వర, అగస్త్యేశ్వరాలయాల్లో రాజరాజేశ్వరిగా తోపు గంగమ్మ ఆలయంలో బాలత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు.

వీరభద్రస్వామి ఆలయానికి వెండి గద అందజేత


ఆలయ అధికారులకు వెండిగదను అందజేస్తున్న భక్తుడు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి కర్ణాటక రాష్ట్రం ధార్వాడకు చెందిన ప్రవీణ్ చాడిచాల్ 500 గ్రాముల వెండి గదను అందజేశారు. వారి పేరుతో అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ రమణారెడ్డి తెలియజేశారు.

శేషవాహనంపై ఊరేగిన గోవిందుడు


శేషవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరుడు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని కే. బుడుగుంటపల్లెలో శనివారం వేంకటేశ్వరస్వామిని శేషవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఆలయంలో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

7న పెనగలూరు మండల సమావేశం

పెనగలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం అక్టోబరు 7న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.విజయరావు తెలిపారు. అధికారులు, అనధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ప్రపంచ దేశాల్లో మోదీ కీర్తిని చాటడమే లక్ష్యం..


పెనగలూరు: రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సాయిలోకేశ్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో ప్రధాని నరేంద్రమోదీ కీర్తిని చాటడమే లక్ష్యమని మండల బీజేపీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ తెలిపారు. శనివారం నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా రైల్వేకోడూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు జయప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకులు వాకచర్ల సుబ్బారావు, జోగినేని సుబ్బారావు, ఆయపాటి గౌరీ, కుప్పాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
పెనగలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోనేటి రెడ్డికృష్ణరాయల్ అధ్యక్షతన 33 మంది రక్తదానం చేశారు. వారికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్ ప్రశంసా పత్రాలు అందజేశారు. నేతలు గడ్డం చెంగల్‌రాజు, రమణయ్య, కృష్ణ యాదవ్, పి.మోహన్ యాదవ్, టి.వెంకటరమణ, శ్రీనివాసులు, చంద్ర మోహన్, వెంకటరెడ్డి, ఇనుగోలు నవీన్‌కుమార్, కాకర్లవారిపల్లె మాజీ సర్పంచ్ పద్మయ్యతదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకే శిక్షణ


మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రాజంపేట డివిజన్ కేంద్రంలో త్వరలో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం రాజంపేట పట్ట ణ కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏపీడబ్ల్యూజే కమిటీ సభ్యు లతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, తాలూకా అధ్యక్షుడు ఇండ్లూరి చిన్నవెంకటరెడ్డి, సీనియర్ పాత్రికేయులు ఎం.సుబ్బనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ వరప్రసాద్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా శనివారం రోడ్డు భద్రతపై పోలీసులు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చునని తెలియజేశారు. సురక్షిత ప్రయాణానికి పాటించాల్సిన ముఖ్య నియమాలు, సూచనలు తెలియజేశారు. 18 ఏళ్లలోపు వారికి వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ నిమయాన్ని ఉల్లంఘించిన తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు నిర్ణీత సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం స్పష్టం చేశారు. డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిబంధనలు పాటించి తమతో పాటు ఇతరుల ప్రయాణాన్ని కూడా సురక్షితంగా మార్చాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

'సమస్యలపై అంగన్వాడీల రాజీలేని పోరాటం'

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నట్లు ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి అన్నారు. రాయచోటి ఎన్జీవో హోంలో వైవీ శివయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో అంగన్వాడీ కార్యకర్తలలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటోందన్నారు. సంక్షేమ పథకాలు అందకుండా చేసిందన్నారు. ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాయపాటి హరికృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం పెద్ద సంఘంగా చెప్పుకుం టున్న సీఐటీయూ దాని అనుబంధ సంఘం అధికారులతో లాలూచీ పడడంతో వర్కర్లకు సకాలంలో జీతాలు, ఇంటి బాడుగల బకాయిలు అందడం లేదన్నారు. ఈ సందర్భంగాజిల్లా కోశాధికారి బంగారుపాపను జిల్లా కన్వీనర్, కోకన్వీనర్‌గా కల్పలత, నసీబ్‌జాన్‌ను ఎన్నుకున్నారు.

జీఎస్టీ 2.0 పేద, మధ్య తరగతి వర్గాలకు వరం

● అన్ని మండలాల్లో విస్తృతంగా అవగాహన సమావేశాలు


రైల్వేకోడూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నాగిరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి వర్గాలకు ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ రూపంలో సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని రైల్వేకోడూరు ఎంపీడీవో నాగిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ సభా భవనంలో మండల స్థాయి అధికారులతో కలిసి సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి గతంలో ఉన్న జీఎస్టీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త జీఎస్టీ వలన పేద, మధ్యతరగతి వర్గాలకు ఎటువంటి ఉపయోగం ఉందో వివరించాలన్నారు. మండల, పంచాయతీ అధికారులు కమిటీలుగా ఏర్పడి ఈ విషయంపై ప్రచారం కల్పించాలని వివరించారు. అక్టోబరు 19 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి, డీటీ మానస,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.
చిన్నమండెం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన జీఎస్టీ 2.0పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల తహసీల్దార్ నరసింహులు, ఎస్ఐ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి గీత, మండల స్థాయి అధికారులు జీఎస్టీ 2.0తో ఉప యోగాలను వివరించారు మండల జీఎస్టీ కమిటీ సభ్యులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.
పెనగలూరు : దేశంలోని అన్నిరకాల ప్రజలకు వస్తుసేవలపై ప్రయోజనాలు కలిగించేవిధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయం తీసుకొని జీఎస్టీ 2.0ను తీసుకొచ్చారని ఐకేపీఏపీఎం నిరంజన్‌కుమార్ తెలిపారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ ప్రజలకు జీఎస్టీ 2.0 ప్రాముఖ్యతను వివరించారు.
సుండుపల్లె: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జీఎస్టీ తగ్గింపు నియమాలను షాపుల యజమానులు పాటించాలని మండల స్పెషలాఫీసర్ సురేశ్‌బాబు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమాలను తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. పేదలకు లబ్ధి చేకూరాలనే సంకల్పంతో జీఎస్టీ తగ్గించామని, జీఎస్టీ తగ్గించిన ప్రతి వస్తువును నియమాలు అనుసరిస్తూ విక్రయించాలని ఆదేశించారు. ఈ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, జనసేన రెడ్డిరాణి, శివరాం నాయుడు, తెలుగు యువత సురేశ్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక

అన్నమయ్య జిల్లా, రైల్వేకోడూరు టౌన్, శ్రీరామ్‌నగర్‌కి చెందిన నా క్లయింట్లు **1. కె. మాధవయ్య తండ్రి కె. వెంకటసుబ్బయ్య,** హైదరాబాద్, **2. కె. జ్యోతి భర్త కె. సుబ్రమణ్యం,** శ్రీరామ్‌నగర్ అనువారలు నాకు ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియజేయడమేమనగా.... రైల్వేకోడూరు మండలం, రెడ్డివారిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెం. 557లో గల 30.5 సెంట్లు భూమి యొక్క వివాదము రైల్వేకోడూరు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో **O.S.No. 103/2025** నందు నా క్లయింట్లు అనగా **1. కె. మాధవయ్య తండ్రి కె. వెంకటసుబ్బయ్య, 2. కె. జ్యోతి భర్త కె. సుబ్రమణ్యం మరియు నాటూరు నర్సింహారెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి** అనే వ్యక్తి మధ్య వ్యాజ్యము పెండింగులో ఉన్నది. కావున అట్టి భూమిని, భూమి / ప్లాట్స్ రూపములో ఎవరైనా అమ్మినా లేక కొన్నా (కోర్టు తుది తీర్పు వచ్చే వరకు) న్యాయ పరమైన చిక్కులు ఎదుర్కోవలసి ఉంటుందని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

ఇట్లు

1. కె. మాధవయ్య తండ్రి కె. వెంకటసుబ్బయ్య
2. కె. జ్యోతి భర్త కె. సుబ్రమణ్యం

ఆర్.సి. సురేష్‌బాబు, అడ్వకేట్, రైల్వేకోడూరు

ప్రజా సమస్యలపై అధికారులు స్పందించాలి


శ్రీవారి కల్యాణోత్సవానికి హాజరైన టీడీపీ ఇన్‌చార్జి చమర్తి, నాయకులు తదితరులు

రాజంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే పరిష్కరించాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు సహకరించి గ్రామాల్లో అధికారులు, నాయకులు కలిసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా అధికారులు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను విని సత్వరమే పరిష్కరించేలా చూడాలన్నారు. అనంతరం ప్రమాదవశాత్తు గాయపడిన జూనియర్ అసిస్టెంట్ కుటుంబ సభ్యులకు రూ50 వేలు ఆర్థికసహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో రాజంపేట తహసీల్దారు పీర్‌మున్నీ, రెవెన్యూ సిబ్బంది కుమారస్వామి, శేషంరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణోత్సవంలో చమర్తి

మండల పరిధిలోని చుండువారిపల్లెలో నిర్వహించిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ధర్మకర్తలు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువతో, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల పురోభివృద్ధిపై దృష్టి సారించండి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోభివృద్ధిపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో పంచాయతీ అభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ పంచాయతీలోని 27 శాఖల నుంచి ఒక్కొక్క టీం 9 మంది చొప్పున వెళ్లి పంచాయతీలోని సమస్యలను గుర్తించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉషారాణి, ఎస్ఐ రవీంద్ర, ఎంఈవో వెంకటసుబ్బయ్య, ఏపీవో నిరంజన్, వ్యవసాయాధికారి రాజకుమారి, మెడికల్ ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు క్రీడలను పోత్సహించడంతోపాటు, మత్తు పదార్థాలను నిలువరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, మండల సీపీఐ అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ తెలిపారు. శనివారం భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా రైల్వేకోడూరులో విద్యార్థులు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 4 వరకు యువజన చైతన్య వారోత్సవాలు నిర్వహించి మత్తు పదార్థాల వాడకంతో ఏర్పడే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, షిరిడి సాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంగల్‌రాజు, ఏఐవైఎఫ్ నాయకులు కొరముట్ల గణేష్, నాయకులు పాలతోటి విజయ్, శెట్టిపల్లి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యం కోసం ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న కువైట్ సేవా సంఘం సభ్యులు

సుండుపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థి నాగ చైతన్య (14) వైద్యం నిమిత్తం కువైట్ సేవా సంఘం సభ్యులు దాతల సహకారంతో రూ.1,14,815 ఆర్థిక సాయం అందించినట్లు విద్యార్థి తండ్రి నాగరాజు తెలిపారు. సుండుపల్లె మండలంలోని దిన్నెమీద బలిజపల్లెకు చెందిన బోనంశెట్టి నాగరాజు కుమారుడు నాగచైతన్య బోన్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. సర్జరీ కోసం రూ.15 లక్షలు అవసరం పడుతుందని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబీకులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న కువైట్ సేవా సంఘం సభ్యులు నంద్యాల నాగరాజా మరికొంత మంది దాతల సహకారంతో నగదును సేకరించి అందజేసినట్లు తెలిపారు.

డిజిటల్ బుక్‌తో న్యాయ యుద్ధానికి శ్రీకారం

రాయచోటిటౌన్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): అన్యాయాలు, అక్రమాలకు చరమగీతం పలికే ఆయుధంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీసుకువచ్చిన డిజిటల్ బుక్ ఉపయోగపడుందని రాష్ట్ర వైసీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైసీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటిలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరణలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్యాయానికి గురైన వైసీపీ కార్యకర్తలు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా గానీ, ఐవీఆర్ఎస్ ఫోన్ నెంబర్ 04049171718 ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని, ఈ బుక్‌లో కార్యకర్తలు తమ అనుభవాలను, అన్యాయాలను, రాజకీయ దాడుల వివరాలను ఫొటోలు, ఆధారాలతో సహా అప్‌లోడ్ చేయవచ్చునని తెలిపారు. ప్రతి ఫిర్యాదు డిజిటల్‌గా భద్రపరచబడుతుందని, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యకర్తలపై కుట్రలు పన్నిన వారిని చట్టపరంగా శిక్షిస్తామని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని వారు గుర్తు చేశారు.

'జగనన్న కాలనీలో మోటార్లు మాయం'!

రాయచోటి టౌన్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మాధవరం గ్రామంలోని జగనన్న కాలనీలో రెండు బోర్ల మోటర్లు, పైపులు, వైర్లు దొంగలించారా లేక అధికారులే తీసేశారా అనే దానిపై నిగ్గు తేల్చాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన జగనన్న కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాధవరం గ్రామం వెంకటాపురం సమీపంలోని జగనన్న కాలనీలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. కాలనీ ఏర్పాటు రెండు బోర్లు వేసి మోటార్లు బిగించారన్నారు. అయితే ఈ రెండు బోర్లకు సంబంధించిన మోటార్లు, పైపులు, వైర్లు ప్రస్తుతం కనిపించడం లేదని, వీటిని ఎవరైనా దొంగలించారా లేక సంబంధించిన అధికారులు తీసుకెళ్లారా అనే విషయంపై విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎ) లిబరేషన్ పార్టీ నాయకులు రమణ, వెంకట చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో మొబైల్ సర్వీసింగ్‌పై శిక్షణ


మోటారు మెకానిజంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ వాహన సర్వీసింగ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీసీడీవో సుమతి తెలిపారు. జిల్లా వృత్తి విద్య సమన్వయకర్త కమాలకర్, యోగేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో శివ గ్యారేజ్‌లో ఐదు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టత పెంచుకోవాలని, విధితో పాటు చేతి వృత్తి విధానాలపై పట్టు సాధించాలన్నారు. పరిజ్ఞానంతో పాటు వృత్తి విద్యలతో కూడా భవిష్యత్తు సాధించవచ్చునని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో శ్రీశైల దేవస్థానం చైర్మన్


పోతుగుంట రమేశ్‌నాయుడును సత్కరిస్తున్న అర్చకులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామిని శనివారం రాత్రి శ్రీశైల దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి వార్ల కృపాకటాక్షంతో ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శివగంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌రాజు, అసెంబ్లీ కోకన్వీనర్ నిర్మల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బాలాజీ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.
రాయచోటి కలెక్టరేట్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రతిభా జూనియర్ కాలేజ్‌లో రమేశ్‌నాయుడును లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ అధ్యక్షుడు లయన్ పసుపులేటి శ్యామ్, బీజేపీ అధ్యక్షుడు శివగంగిరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా లయన్ పీఎస్ హరినాథరెడ్డి, రీజియన్ చైర్మన్ లయన్ షేక్. మహమ్మద్ మాట్లాడుతూ లయన్ పోతుకుంట రమేశ్‌నాయుడు సేవలను గుర్తించిన ప్రభుత్వం శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌గా నియమించిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ సభ్యులు, ఏబీవీబీ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కామ్రేడ్ సుధాకర్‌ప్రసాద్‌కు నివాళి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో హోంలో శనివారం కామ్రేడ్ సుధాకర్‌ప్రసాద్ 24వ వర్ధంతి సందర్భంగా ఏపీఎన్జీవో హోమ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్జీవో సంఘం రాయచోటి తాలూకా అధ్యక్షుడు దండు వెంకటేశ్వర్‌రెడ్డి, సహాధ్యక్షుడు పల్లవు మహదేవ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు పంచాయతీ నిధులు

● వీధి దీపాల పేరుతో రూ.7.50 లక్షలు చెల్లింపు ● నాడు వైసీపీ నేత ఆదేశంతో రియల్ వ్యాపారికి లబ్ధి

సాధారణంగా ఎక్కడైనా పంచాయతీ అనుమతితో నిబంధనల మేరకు ప్రైవేటు వ్యక్తులు, రియల్ వ్యాపారులు లేఅవుట్ వేస్తే.. అక్కడ నివాసాలు ఉంటే విస్తరణలో భాగంగా వీధిలైట్ల ఏర్పాటుకు పంచాయతీ నిధులు వెచ్చించాలి. అది కూడా సింగిల్ వైరు (కండెక్టర్) మాత్రమే లాగాలి. కానీ బసినికొండ పంచాయతీలో వేసిన లేఅవుట్‌లలో ఆ స్థాయిలో నిర్మాణాలూ జరగలేదు. కాపురాలూ లేరు. అయినా సరే వైసీపీకి చెందిన రియల్ వ్యాపారి.. బిల్డర్ అయిన ఓ వ్యక్తి లబ్ధి చేకూర్చే క్రమంలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఆదేశాలతో రూ.7.50లక్షల పంచాయతీ నిధులతో ఇక్కడ విద్యుత్ ఏర్పాటు చేశారు.


బైపాస్‌రోడ్డు సాయిబాబాగుడి ఎదురుగా లేఅవుట్‌లో లాగిన విద్యుత్తు లైన్లు

మదనపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వడ్డించే వాడు మనోడైతే.. బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే అనేలా.. ఇక్కడి అధికారులు వ్యవహరించారు. పంచాయతీలో మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధి లైట్లు, శానిటేషన్ సక్రమంగా లేక ప్రజలు అల్లాడుతుంటే పట్టించుకోని పాలకులు, అధికారులు.. ప్రైవేటు లేవుట్‌లో మాత్రం నిధులు వెచ్చించారు. పన్నుల రూపంలో ప్రజలు పంచాయతీకి చెల్లించిన సొమ్మును వారి సంక్షేమం, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉండగా.. రియల్ ఎస్టేట్ వ్యాపారి అభివృద్ధికి సహకరించి స్వామి భక్తిని చాటుకున్నారు. వందలు కాదు వేలు కాదు.. ఏకంగా లక్షల రూపాయలు వెచ్చించి విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేశారు.

మదనపల్లె మండలంలోని బసినికొండ పంచాయతీ పరిధిలో ఉన్న మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వైపీపీ పాలనలో లేఅవుట్‌లు వేశారు. వీటిని అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరుడు, సన్నిహితుడు ఏర్పాటు వేశారు. ఇందులో బసినికొండ కస్పాలోని పంచాయతీ కార్యాలయం వెనుక వైపున (నిమ్మనపల్లె రోడ్డు నాలుగు కూడలి వద్ద) ఒకటి, బైపాస్ రోడ్డు సాయిబాబా గుడికి ఎదురుగా మరొక వెంచర్ వేశారు. అక్కడి ఒక లేవుట్‌లో ప్లాట్లు అమ్మిందీ లేదు. కస్టమర్లు కొన్నదీ లేదు. రియల్ వ్యాపారే బిల్డర్‌గా నివాసాలు, డూప్లెక్స్ నిర్మాణాలు చేపట్టి కస్టమర్లకు విక్రయిస్తున్నారు. ఇందులో మదనపల్లె-నిమ్మనపల్లె ప్రధాన రహదారి నుంచి లేఅవుట్‌లోని నివాసాల చివరి వరకు త్రీఫేజ్‌లో విద్యుత్తు_లైన్ వేశారు. ఇక్కడ తొమ్మిది విద్యుత్ స్తంభాలు, అయిదు వైర్ల చొప్పున కండెక్టర్ లాగారు. ఇందుకోసం బసినికొండ-1 పంచాయతీ నుంచి రూ.3.38 లక్షలు ట్రాన్స్‌కోకు 2023 డిసెంబరు 1వతేదీన చెల్లించారు. ఇక్కడ రెండు మూడు గృహాల్లో మాత్రమే నివాసాలు ఉండగా, మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. నివాసం ఉన్నవి కూడా డూప్లెక్సు సంపన్నులు ఉండేవి. ఇలాంటి లేవుట్‌లో వీధి దీపాల ఏర్పాటు పేరుతో పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్ములు అర్పించారు. సాయిబాబా గుడికి ఎదురుగా ఉన్న మరో వెంచర్‌లోనూ ఇలాగే చెల్లించారు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలు, త్రీఫేజ్ లైన్ కోసం రూ.4 లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇలా రెండు ఏరియాలలో రూ.7.50 లక్షలకుపైగా అత్త సొత్తు అల్లుడి దానం అన్నట్లు వెచ్చించారు.

నిబంధనలకు విరుద్ధంగా..

బైపాస్‌రోడ్డు నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న ఈ లేఅవుట్ బసినికొండ-2 పరిధిలోకి వస్తుంది. కానీ బసినికొండ-1 నుంచి నిధులు వెచ్చించారు. అదీ వైసీపీలోని అడ్డదిడ్డ పాలన. వీరిని ఎవరూ అడిగే వారే లేరు. అడిగినా సమాధానం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వారి ఇష్టానుసారం చేసేశారు. ఎక్కడ అనుకూలమో, ఎక్కడ తాముకాలితో చెబితే, చేత్తో చేస్తారో అలాంటి వారి నుంచే చేయించారు. రియల్, బిల్డర్‌గా ఉంటున్న వైసీపీ నేతకు ఆర్థిక లబ్ధి చేకూర్చారు.

స్థానికుల ఆగ్రహం

బసినికొండ పంచాయతీ పట్టణ శివారు ప్రాంతంలో విస్తరించి, పట్టణంలో కలసిపోయింది. అయితే పట్టణ స్థాయిలో వసతులు, సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే, రియల్‌వ్యాపారి లేఅవుట్‌లో పంచాయతీ నిధులు ఖర్చు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా పంచాయతీలో కొత్తగా లేఅవుట్ వేస్తే, అక్కడి నుంచి పన్నులతో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టాలే కానీ.. నివాసాలు లేని చోట నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయడం ఏంటనేది అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. దీనిపై డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పంచాయతీ నిధులు ప్రైవేటు లేఅవుట్‌లలో ఖర్చు చేయకూడదని అన్నారు. వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



బసినికొండలోని రియల్ వ్యాపారి లేఅవుట్‌లో విద్యుత్తు లైన్ - రామాచార్లపల్లె సమీపంలోని లేవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

మళ్లీ ఆలస్యంగా ఏడుకొండలు రైలు



ములకలచెరువు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడుకొండలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం కూడా తీవ్ర ఆలస్యంగా నడిచింది. ఈ మార్గంలో వారానికి రెండుసార్లు నడిచే ఏడుకొండలు రైలు ఈనెల 24వ తేదీ ఐదున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచిన విషయం విదితమే. ఈ రైలు శనివారం కూడా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక కారణాలతో రైలు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ఆలస్యంగా బయలుదేరింది. ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 6.26 గంటలకు వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు చేరాల్సిన రైలు ఉదయం 9 గంటలకు వెళ్లింది.

గుంటూరు-ధర్మవరం మధ్య రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సత్యసాయిబాబా 100వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గుంటూరు నుంచి ధర్మవరం, ధర్మవరం నుంచి గుంటూరుకు రెండు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జంక్షన్ నుంచి ధర్మవరం జంక్షన్‌కు (రైలు నెంబర్ 17261) అక్టోబరు 1వ తేదీ నుంచి నవంబరు 30 వ తేదీ వరకు ప్రత్యేక రైలు నడుస్తుంది. అలాగే ధర్మవరం జంక్షన్ నుంచి గుంటూరు జంక్షన్‌కు (రైలు నెంబర్ 17262) అక్టోబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు మరో రైలు నడుస్తుంది. ఈ రెండు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు గుంటూరు జంక్షన్, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపూర్ రోడ్, కంబం, గిద్దలూరు, నంద్యాల, బలనగనపల్లె, కోవెలకుంట, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె రోడ్, ములకలచెరువు, కదిరి, ధర్మవరం రైల్వేస్టేషన్లలో ఆగుతాయి.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


నాగేంద్ర మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు నాగేంద్ర (37) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, కొండామారిపల్లె గ్రామంలోని తట్టివారిపల్లెకు చెందిన శేషయ్య కుమారుడు నాగేంద్ర అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నట్లు తెలిపారు. కాగా ఉన్న ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందాడన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికిలోని శవపరీక్ష గదికి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం ... కేసు నమోదు


శ్రీకాంత్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వ్యక్తి ఆదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండ్‌లో గాయత్రి మెడికల్ షాపు నిర్వహిస్తున్న శ్రీకాంత్ (58) శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు బెంగళూరు రోడ్డు సమీపంలో హంద్రీ-నీవా కాలువ గట్టున స్కూటీ, చెప్పులు ఉన్నట్లు గుర్తించామన్నారు. కాగా కాలువ, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెదికినా ఏమీ లభ్యం కాలేదని చెప్పారు. మృతుడికి భార్య గాయత్రి, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్


అధికారులు సీజ్ చేసిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారుల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక ఎక్స్‌కవేటర్, రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని మదనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వాహనాల యజమానికి జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

జాక్‌పాట్ విధానంపై ఏడీఎం విచారణ

గుర్రంకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంపై మార్కెట్ శాఖ ఏడీఎం త్యాగరాజు విచారణ చేపట్టారు. ఈనెల 2వ తేదీ రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్ నాయుడు జాక్‌పాట్ విధానంతో వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఏడీఎం శనివారం గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం, అధిక కమీషన్లపై రైతులతో మాట్లాడారు. రైతుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం మార్కెట్ యార్డులో టమోటా వేలం పరిశీలించారు. మార్కెట్ యార్డులో ఈ-నామ్ అమలు సరిగా లేదంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అమ్మయ్యా... దాహం తీరింది...


బాటిల్ మూత వచ్చింది... ఇలా తాగేద్దాం

వాల్మీకిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఎండ మండిపోతున్న వేళ ఓ వానరం వాటర్ బాటిల్‌లోని నీరు తాగి తన దాహార్తిని తీర్చుకుంది. కొత్తపేట వీధిలోని గ్రామీణ బ్యాంకు సమీపాన ఓ ఇంటర్నెట్ దుకాణంలోకి వెళ్లిన వానరం అక్కడ ఉన్న ఓ వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లి గోడమీద కూర్చుని దాని మూతను తీసేందుకు నానా తంటాలు పడింది. ఎలాగోలా బాటిల్ మూతను తొలగించి అందులోని నీటితో దాహం తీర్చుకోవడమే కాక నీటిని ముఖంపై పోసుకుని ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందింది.

డీఎస్సీ నియామకంపై సంబరాలు


నాయకుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పీలేరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలు పూర్తయిన సందర్భంగా పీలేరులోని ఏపీసీపీఎస్‌ఈఏ, ఎన్‌టీఏ నేతలు శనివారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేశ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లోనే విజయవంతంగా డీఎస్సీ నిర్వహించి, దాదాపు 16 వేల మందికి నియామకపత్రాలు అందజేసినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్‌ఈఏ) జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

రాష్ట్రంలోని ఉద్యోగులందరూ వేయి కళ్లతో ఎదురుచూస్తున్న డీఏలపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని, పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక అందించేలోపు మధ్యంతర భృతిని ప్రకటించాలని, తద్వారా ఉద్యోగులు దసరా, దీపావళి పండుగలను సంతోషంగా చేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, అమరనాథ్, మస్తాన్, సుబ్రహ్మణ్యం, ధర్మయ్య, శివశంకర్, జనార్దన్‌రెడ్డి, జయరాం, వేణుగోపాల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణితో పాటు నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల మండల స్థాయి సిబ్బందితో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, విద్య, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖలతో తదితర అంశాలపై కలెక్టర్ నిశాంత్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలు 15 రోజులకు ఒకసారి తాగునీటి వనరులను తనిఖీ చేయాలన్నారు. ట్యాంకులపై సరైన కవర్లు ఉండాలని లేకుంటే పక్షులు, ఎలుకలు, చెత్త వంటి పదార్థాలు నీటిలో పడే ప్రమాదం ఉందన్నారు. ట్యాంకులు శుభ్రపరచే పనులు రెగ్యులర్‌గా చేయాలన్నారు. ఈ వారం చివరికల్లా అన్ని ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కలిసి నివేదిక ఇవ్వాలని, పైప్‌లైన్‌లు ఎక్కడా డ్రైనేజ్ పక్కన లేకుండా ట్యాంకులకు మూత ఉండాలన్నారు.

పశువుల వ్యాధుల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మండల ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


సుండుపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్, సీనియర్ మెన్ రాష్ట్ర స్థాయి పోటీలకు సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పుల్లంపేటలో జరిగిన సబ్ జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్ల ఎంపికల్లో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు అభి, బాలికల విభాగంలో సంధ్య రాష్ట్ర పరిశీలకుల దృష్టిని ఆకర్షించారు. సీనియర్ మెన్ విభాగంలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు కార్తీక్, ఆంజనేయులు జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారని ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు. సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి పోటీలు అక్టోబరు 4, 5, 6 తేదీల్లో శ్రీకాకుళంలో, సీనియర్ మెన్ పోటీలు నవంబరులో గుంటూరులో జరుగుతాయి.

ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

పుల్లంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని ఆదర్శ పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో 8 మంది ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో రిషిత్, నితీష్, ప్రతాప్, బాలికల విభాగంలో అఖిల, పుష్పలత, సుశాంతి, కార్తీక, తన్విక అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ నీలకంఠ రావు, ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి తెలిపారు.

40 ఏళ్లుగా నిరీక్షణ

- ● జెడ్‌హెచ్‌డీసీ భూముల పట్టాలకు ఇంకెన్నాళ్లు....?
- ● ఏక్ సాల్ పర్మిషన్లతో ప్రభుత్వ లబ్ధికి దూరం
- ● సంబేపల్లె తప్ప అన్ని మండలాల్లో పట్టాలు పంపిణీ
- ● కూటమి ప్రభుత్వంపైనే దళిత రైతుల ఆశలు



2015లో చీఫ్ సెక్రటరీ ఇచ్చిన ఉత్తర్వులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జెడ్‌హెచ్‌డీసీ భూముల పట్టాల కోసం 5, 10, 15 ఏళ్ల కాదు ఏకంగా 40 సంవత్సరాలుగా దళిత రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామం సర్వే నెంబర్-430లో 110 ఎకరాలు, మోటకట్ల గ్రామం సర్వే నెంబర్-831లో 159 ఎకరాలు పొలం జెడ్‌హెచ్‌డీసీ కింద ఉంది. ఈ భూముల్లో పంటలు పండించేది రైతులు. దానిపై పెత్తనం మాత్రం జిల్లా హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులది. ఈ భూములకు సంబంధించి ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన 154 మంది దళిత రైతులు పట్టాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. 1985 నుంచి ప్రతి యేటా ఏడాదికి 75 రూపాయలు రుసుం చెల్లించి రైతులకు ఏక్ సాల్ పర్మిషన్‌తో పొలాలు సాగు చేసుకుంటున్నారు. పంటసాగు చేసి రైతుల పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి లబ్ధి రైతులకు మాత్రం రావడం లేదు. రైతులకు పట్టాలు లేవు, పాస్‌బుక్కులు లేవు. దీంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు రావడం లేదు. నష్టం వచ్చినా, కష్టం వచ్చినా ఫలితం మాత్రం రైతులకు దక్కడం లేదు. ఏళ్ల తరబడి దళిత రైతుల నిరీక్షణ తప్పడం లేదు.

ఆ భూములపై 2015 నుంచి అధికారుల ప్రతిపాదనలు


జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి పట్టాల కోసం శివవెంకటస్వామి ఫిర్యాదు మేరకు 2015లో చీఫ్ సెక్రటరీ అప్పటి జిల్లా కలెక్టర్‌కు పట్టాలు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. అయితే పట్టాలు అప్పట్లో ఇవ్వలేదు. 2017లో అప్పటి కడప ఉమ్మడి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ జిల్లాలో 13 మండలాలకు సంబంధించి జెడ్‌హెచ్‌డీసీ భూములు ఉన్నాయని, 1538 మంది రైతులకు సంబంధించి 2906.74 ఎకరాలు సంబంధించి పట్టాల కోసం ప్రతిపాదలను సిద్ధం చేసి పంపారు. అయితే జిల్లాలో సంబేపల్లె తప్ప మిగిలిన అన్ని మండలాల్లో జెడ్‌హెచ్‌డీసీ భూములను దళిత రైతులకు పట్టాలు అందజేశారు. ఇప్పటికీ సంబేపల్లెకు చెందిన రైతులు మాత్రం పట్టాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. సంబేపల్లె, పెండ్లిమర్రి, వల్లూరు, ఖాజీపేట, కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట, నందలూరు, అట్లూరు, గోపవరం, పోరుమామిళ్ల, మైదుకూరులలో జెడ్‌హెచ్‌డీసీ భూములు ఉన్నాయి.

కాలువకు పోయిన జెడ్‌హెచ్‌డీసీ భూములు

సంబేపల్లె మండలానికి సంబంధించి జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో 2017లో మండిపల్లి నాగిరెడ్డి రిజర్వాయర్ సబ్ కెనాల్ కాలువలకు ఈ భూములు పోయాయి. జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అప్పట్లో ఎస్సీ కార్పొరేషన్ వారికి పరిహారం కింద 54 లక్షల 58 వేల 104 రూపాయల పరిహారం మంజూరు అయినట్లు ఉత్తర్వులు పంపారు. దీనికి సంబంధించిన డబ్బులు మాత్రం రైతులకు అందలేదు. ఈ భూములకు సంబంధించి కొలతలు వేసి సర్వేలు చేసి ఫైలు సిద్ధం చేశారు. పట్టాలు మాత్రం రాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా దళిత రైతుల పట్టాలు అందించాలని కోరారు.

సంబేపల్లె మండలంలోని జెడ్‌హెచ్‌డీసీ భూమి


భూములపై హక్కు కల్పించాలి



40 ఏళ్లుగా ఈ భూములపై పోరాటం చేస్తున్నా. ఇప్పటికైనా ఈ భూములపై హక్కు కల్పించాలి. పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు ఏమీ అందడం లేదు. పర్మిషన్ పేరుతో మా గొంతు కోస్తున్నారు. ఇప్పటికైనా విముక్తి కల్పించాలి. పట్టాలు ఇచ్చి పుణ్యం కట్టుకోవాలి.

- శివవెంకటస్వామి, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



భూములకు కొలతలు వేశారు. ఫైలు సిద్ధం చేశారు. అయినా పట్టా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొని ఉన్నాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు పొందాలంటే పట్టా, పాసుబుక్కు ఉండాలి. ఇవి కల్పించి సాయం చేసి ఆదుకోవాలి.

- సుబ్బన్న, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

పోషణ మాసం... ఆరోగ్యమే లక్ష్యం

జిల్లాలో అంగన్వాడీల కార్యక్రమం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రకరకాల సమస్యలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు బాలింతలు తగిన జాగ్రత్తలు వహిస్తే తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. రక్తహీనత, బలం లేకపోవడం వల్ల కొంత వరకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అదే విధంగా నీరసం, వంటి సమస్యలతో వయసుతో సంబంధం లేకుండా అనేక మంది బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్ర్తీశిశు సంక్షమశాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16 వరకు రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవం 2025ను నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఉన్న 2212 మెయిన్ అంగన్వాడీ కేంద్రాల్లో 177 మినీ అంగన్వాడీ కేంద్రాల్లో 11,267 మంది గర్భిణులు, 12,821 మంది బాలింతలు 56,340 మంది 3 నుంచి 6 సంవత్సరాల్లో పిల్లలకు తగిన జాగ్రత్తలు



సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ ఆరోగ్య సిబ్బంది

సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు.

నెల రోజుల్లో కార్యక్రమాలు

అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో బలాన్నిచ్చే వంటకాల తయారీ, తక్కువ ధరకు లభించే పండ్ల పోషణ విలువలు వివరిస్తున్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు బరికెలు తదితర తృణధాన్యాలతో వంటకాలు ఎలా తయారు చేయాలో మహిళలకు కార్యకర్తలు వివరిస్తున్నారు. పోషకాహార తయారీపై పోటీలు నిర్వహించడం జరుగుతోంది. అదే సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాల ప్రాధాన్యత అను బంధ ఆహారంపై వివరిస్తున్నారు. కథలు, బొమ్మల ద్వారా తల్లి దండ్రులకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆహారం వండేటప్పు డు పోషకాలు నష్టపోకుండా తగిన మోతాదులో ఎలా తయా రు చేయాలో చేసి చూపించడం జరుగుతోంది. అంగన్వాడీ కేంద్రాల్లో గ్రామల్లోని బహిరంగ ప్రదేశాల్లో న్యూట్రిషన్లతో పోషకాహారం చేయించి ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. వయసుల వారీగా చిన్నా రులు ఎంత మోతాదులో ఆహారం తీసుకోవాలో సూచిస్తున్నారు. స్థూలకాయ నివారణకు చక్కెర, నూనె వినియోగం ఏ విధంగా వాడాలో వివరిస్తున్నారు. తల్లుల ఆధర్యంలో పోషణపై ప్రతిజ్ఞ, పిల్లలకు అపార్ ఆబా ఐడీల నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు.

పోషకాహారం పక్కాగా నిర్వహించేందుకు చర్యలు



పోషకాహార మాసోత్సవాలను అన్ని అంగ న్వాడీ కేంద్రాల్లో పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోషకాహారంపై ప్రదర్శనలు నిర్వహించి తల్లులకు అర్థమ య్యేలా చెప్పాలని సిబ్బందికి సూచించాం. కార్యక్రమం అక్టోబరు 16 వరకు నిర్వహిం చడం జరుగుతుంది.

-రమాదేవి, పీడీ, ఐసీడీఎస్



కమలాపురంలో నిర్వహించిన పోషకాహార ప్రదర్శన

గండికోట, రాజోలి సమస్యలు పరిష్కరించాలి

- మరోసారి అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే ఆది



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి) గండికోట ప్రాజెక్టు, రాజోలి ఆనకట్ట సమస్యలను పరిష్కరించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారా యణరెడ్డి శనివారం మరోసారి అసెం బ్లీలో గళం విప్పారు. ఈ రెండిటిపైనా ఈనెల 19న అసెంబ్లీలో మాట్లాడిన ఆయన, తిరిగి వాటి గురించి అసెం బ్లీలో లేవనెత్తారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు అందాల్సిన రూ.460 కోట్ల పరిహారం గురించి మంత్రి నిమ్మల రామనాయుడు, నీటిపారుదల సెక్రటరీ సాయిప్రసాద్‌తో కలిసి ఎన్నిసార్లు అడిగి నా సమస్య అడుగునే ఉందని, ఆర్థికశాఖ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే సభదృష్టికి తీసుకెళ్లారు. కుందూనదిపై రాజోలి ఆనకట్టను మూడు టీఎంసీలతో నిర్మించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ జీవో ఇచ్చారన్నారు. దీనివల్ల రైతులు భూములు అమ్మ కుండా, కొనుకుండా బ్లాక్ చేశారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆనకట్టను నిర్మించాలని, లేదా గత జగన్ ప్రభుత్వం జారీచేసిన జీవోను రద్దు చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోరారు.

అలగనూరు మరమ్మతులతో కేసీ రైతులకు మేలు

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పుట్టా



అసెంబ్లీలో రైతు సమస్యలను ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): అలగనూరు రిజర్వాయర్ మర మ్మతులతో కేసీ రైతులు క్షామం నుంచి క్షేమం వైపు పయనిస్తారని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. 8వ రోజు జరి గిన అసెంబ్లీ సమావేశాల సంద ర్భంగా కేసీ కెనాల్ రైతుల సమ స్యలను ఆయన ప్రస్తావించారు. 92 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న కేసీ కెనాల్ రైతుల ఇరు కారు పంట ఆకాంక్ష నెరవేరేందుకు కేసీ కెనాల్‌కు అనుసంధానంగా సుమారు 3 టీఎం సీల నీటి నిల్వ సామర్థ్య ఉన్న అలగ నూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మరమ్మతులు చేస్తే 250 కోట్ల రూపా యల ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. ఇందుకు కేవలం రూ.36 కోట్లు వెచ్చిస్తే సరిపోతుం దన్నారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమయ్యే నిధులను మంజూరు చేసి కేసీ కెనాల్ రైతులను ఆదుకో వాలని శాసనసభ ద్వారా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్‌జీఎఫ్ అండర్ 19 బ్యాడ్మింటన్ (షటిల్)కు బాలబాలికలు ఎంపిక



కడప స్పోర్ట్స్, సెప్టెం బరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడ రేషన్ రెండో విడత క్రీడ ల ఎంపికల్లో భాగంగా శనివారం కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్ 19 బ్యాడ్మింటన్ (షటిల్) క్రీడాపోటీల్లో జిల్లా నలుమూలల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యా రు. ఇందులో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో జి.పూజిత, ఎస్.శృతిక, జె.మునీగీతిక, వై.నాగమౌనిక, జీకే సంకీర్తన, స్టాండ్ బైగా వీ.పౌర్ణిమ, సి.రీనా, బాలుర విభాగంలో ఎ.సాయి నవ్‌నీత్ దత్త, సి.త్రివిక్రం, ఎస్.ఇస్మాయిల్, పవన్‌రెడ్డి, అభినవ్, స్టాండ్‌బైగా ఏవీ సాయి సంతోష్, జె.దినేష్‌లు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ అండర్ 19 ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి చంద్రమోహన్‌రాజులు వెల్లడించారు.

వైవీయూ వలంటీర్లకు అరుదైన అవకాశం



బి.ఈశ్వర్, బి.నవీన్, నీలమహేశ్వరి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వెస్ట్ జోన్ ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్‌కు ఎంపికయ్యారు. బి.ఈశ్వర్ (వైవీయూ), బి.నవీన్ (ప్రభు త్వ డిగ్రీకళాశాల, మైదుకూరు), పి.నీలమహేశ్వరి (ప్రభుత్వ డిగ్రీ కళా శాల, కడప) గుజరాత్‌లో జరిగే శిబిరానికి హాజరవుతున్నారు. శిబి రంలో ప్రతిభ కనబరిస్తే 2026 జనవరిలో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కనుం ది. ఈసందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజి స్ట్రార్ పి.పద్మ, సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి, వలంటీ ర్లను అభినందించారు.

కడప ఆర్ట్స్ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 2025-26 విద్యా సంవత్స రానికి డిగ్రీ మొదటి సంవత్సరం కోర్సుల రెండో విడత ప్రవేశాలకు సెప్టెంబరు 26 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీ.కాం, బీఎస్సీ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెండో విడత వెబ్ ఆప్షన్ల నమోదు సెప్టెంబరు 29న మొదలవుతుందని, విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రాంతీయ జీవనశైలికి ప్రతిరూపంగా భూమిపూజ కథనం



అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వేంపల్లె గంగాధర్

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సాహితీ సదస్సులో కడప జిల్లా ప్రతినిధి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వేంపల్లె గంగాధర్ పాల్గొన్నారు. శనివారం సాయంత్రం జరిగిన విభిన్న భాషల కథా సదస్సులో రాయలసీమ గ్రామీణ జీవనాన్ని సజీవంగా చిత్రించిన భూమి పూజ కథను ఆయన సమర్పించారు. ఈ కథ ద్వారా ప్రాంతీయ జీవనశైలి, సంస్కృతి, వ్యక్తిత్వాలను స్పష్టంగా ప్రతిబింబింప జేశారు. దేశీయ, అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక ప్రతిభలతో కూడిన ఈ సదస్సు రచయితలు, కళాకారుల మధ్య సృజనాత్మక చర్చ లకు వేదికగా మారింది.

నవంబరు 2న జానమద్ది సాహితీ పీఠం పురస్కారాల ప్రదానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీ వేత్త బ్రౌన్‌శాస్త్రి జానమద్ది శతజయంతి సందర్భంగా జానమద్ది సాహి తీ పీఠం పురస్కారాల ప్రదానోత్సవం నవంబరు 2న మధ్యాహ్నం 2 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో జరగనుందని జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జ్యోతిర్మయి వెంకటప్రతాప్ హాజరవుతా రన్నారు. సాయంత్రం అన్నమయ్య కీర్తనల కచేరి, అనంతరం సాహి త్య ప్రసంగాలు జరుగుతాయని తెలిపారు.

సుబ్బిరెడ్డి ఆత్మహత్యకు కారకులైన నిందితులను అరెస్టు చేయాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నెపల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డిని వేధించి ఆత్మహత్య చేసుకునేలా చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సీఆర్వీ ప్రసాద్ అధ్యక్షతన శనివారం ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వవిహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ (జేసీఐపీ) జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర నాయకుడు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సత్తార్, సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకుడు ఓబ య్య మాట్లాడారు. సుబ్బిరెడ్డి ఆత్మహత్య విషయంపై అప్పటి ఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చి ఇప్పటికి 50రోజులవుతున్నా ఇంత వరకు దోషులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైసీపీ రైతు సంఘం నగర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, లోక్‌సత్తా జిల్లా కార్యదర్శి దేవర శ్రీకృష్ణ, వైహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసులు, ఆర్ఎస్ఎఫ్‌రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు

- నెలాఖరులోగా పంట నమోదు పూర్తి కావాలి
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సతీష్



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్

పులివెందుల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ సిబ్బందిని హెచ్చరించారు. శని వారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఉద్యాన శాఖ, రాష్ట్ర సూక్ష్మ సాగునీటి పథకం వారి ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ లింగాల, వేముల మండలాల్లో పంట నమోదుకు శాతాన్ని ఆర్ఎస్‌కేల వారీగా పరిశీలించారు. కొన్నిచోట్ల పంట నమోదు శాతం తక్కువగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు నెలలు అవుతున్న పంట నమోదు పూర్తికాకపోవడం ఏమిటని మందలించారు. ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉందని, పూర్తిచేయాల్సిందే అన్నారు. గైర్హాజరైన వారి గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యాన పంటలు నాటుకునే రైతు లకు దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, నేరేడు వంటి పంట లకు రాయితీ ఉంటుందన్నారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులుకు చేపట్టాల్సిన నివారణ చర్యలను సిబ్బందికి వివరించారు. అనంతరం ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్ అందాలన్నారు. ఆర్ఎస్‌కేల వారీగా ఇచ్చిన లక్ష్యా లను పూర్తి చేయాలన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతు లకు వందశాతం రాయితీతో రూ.2.18 లక్షలు, చిన్న, సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.2.18లక్షల వరకు రాయితీ అందజేస్తారన్నారు. 5 నుంచి 10 ఎకరాల పైన ఉన్నరైతు లకు 50శాతం రాయితీతో రూ.4లక్షల వరకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. డ్రిప్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పులివెందుల ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి, వేముల, లింగాల మండ లాల ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంతో కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

చెన్నూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను ఎవరు వినియో గించినా వారి కుటుంబ వ్యవస్థ చిన్నా భిన్నం అవుతుందని డీఆర్‌డీఏ పీడీ రాజ్య లక్ష్మి అన్నారు. చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం మాదక ద్రవ్యాల వినియోగం, వాటివల్ల కలిగే అనర్థాలపై గ్రామ సమాఖ్య సభ్యు లతో సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల విని యోగంపై అత్యంత కఠినంగా వ్యవహరి స్తోందన్నారు. ఈగల్‌టీం ఏర్పాటు చేసి గంజాయి లాంటి మత్తు పదార్థాలను యువత తీసుకోకుండా పూర్తిస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంద న్నారు. ఇందుకోసం సమాజంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. తాత్కాలిక ఆనందం కోసం యువత మత్తుపదార్థాలకు బానిస అయితే చేజే తులారా భవిష్యత్తు నాశనం చేసుకున్న ట్లేనని తెలిపారు.

ఈనెల 22 నుంచి కేంద్రం జీఎస్టీని తగ్గించిందని, తద్వారా ఎన్నోరకాల విని యోగకరమైన వస్తువులపై ధరలు తగ్గా యన్నారు. ఒకవేళ పూర్వపు ధరలే ఉంటే ఆ విషయం అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్ర మంలో ఏపీయం వెంకటేశ్, సీసీ నారాయణరెడ్డి, వీవోఏలు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వంది ప్రజలే

- స్థానిక ఎన్నికల్లో కూటమి స్వీప్ చేస్తుంది
- శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్



హార్సిలీహిల్స్‌లో విలేకరులతో మాట్లాడుతున్న షరీఫ్

బి.కొత్తకోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు దుష్ట పాలనతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వైసీపీకి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా లేకుండా చేసింది రాష్ట్ర ప్రజలేనని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహా రాల సలహాదారు షరీఫ్ తెలిపారు. హార్సిలీహిల్స్‌లో శనివారం పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభు త్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. జగన్ హయాంలో ముందుచూపు, రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి కేవలం మెప్పు కోసం బటన్లు నొక్కి రాష్ట్రం రూ.లక్ష కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశాడన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు క్లీన్‌స్వీప్ చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు మెడికల్ కాలేజీల్లో సీట్లు అమ్ముకుని లాభపడాలని చూశారని, ప్రభుత్వం రాకపోయే సరికి పీపీపీ విధానంపై బురద జల్లుతున్నారన్నారు. ప్రస్తుతం తమ భూము లను లాక్కుంటారు, స్థలాలను కబ్జా చేస్తారు, అక్రమ కేసులు పెడతారు, వెంచర్లలో వాటాలు అడుగుతారనే భయాలు లేకుండా రైతులు, వ్యాపారులు, ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నా రన్నారు. టూరిజం అభివృద్ధికి చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నా రని హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక నిధుల కేటాయింపు జరుగుతుంద న్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం హజ్‌యాత్ర, దుల్హన్ లాంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరిం చారు. అంతకు ముందు తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవ ర్గాల ముస్లిం మైనార్టీ నేతలు ఆయనకు సాదరస్వాగతం పలికి పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, ఎస్ఏ మస్తాన్, రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్, తంబళ్లపల్లె టీడీపీ నేతలు అయూబ్‌బాషా, సికిందర్ ఆజం, ఎండీ మస్తాన్, సాజిద్ బాష, లతీఫ్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో విద్యార్థిని కిడ్నాప్

- పట్టుకున్న పోలీసులు
- నలుగురిపై కేసు నమోదు

కడప క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రోడ్డు లోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఇంజనీరింగ్ విద్యార్థినిని కారులో బలవంతంగా ఎక్కించుకుని పారిపోయారు. దీంతో ఆ యువతి తల్లి గట్టిగా కేకలు వేయడంతో అక్కడున్న వారు సీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బాలమద్దిలేటి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముద్దనూరు మండలం బొందలకుంట గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్‌గా, కిడ్నాప్ చేసి యువతిని తీసుకెళ్లిన కారు నెంబరు గుర్తించారు. సీఐ బాలమద్దిలేటి ఇటు వేంపల్లె, కమలాపురం, ఎర్రగుంట్ల పోలీ సులను అలర్ట్ చేశారు. దీంతో ఎర్రగుంట్లలో కిడ్నాపర్‌ను అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. సీఐ బాలమద్దిలేటి వివరాల మేరకు.. తొండూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన యువతి పులివెందుల రోడ్డులోని ఇంజనీరింగ్ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు కావడంతో తన కుమార్తెను తీసుకెళ్లేందుకు కాలేజీ వద్దకు వచ్చింది. తల్లీ కూతు రు ఊరికి వెళ్లేందుకు బస్టాపు వద్ద ఉండగా పవన్‌కళ్యాణ్, అతని సోదరుడు రాజేశ్, అరవింద్, సురేంద్రలతో కలిసి కారు లో అక్కడకి వచ్చారు. ఆ యువతిని బలవంతంగా కారులో ఎక్కించే ప్రయత్నం చేయగా తల్లి అడ్డుపడింది. దీంతో వారు ఆమెను కిందకు తోసివేసి కారులో ఎక్కించుకుని పరారీ అయి నట్లు తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు పవన్‌కల్యాణ్, అతని తమ్ముడు రాజేశ్, స్నేహితులు అరవింద్, సురేంద్రలపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధికుక్కల దాడి.... 30 మేకపిల్లలు మృతి



మృతి చెందిన మేకపిల్లలు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ముడుమాల పంచాయతీ జౌకుపల్లె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వీధికుక్కలు దాడి చేయడంతో 30 మేకపిల్లలు మృతి చెందాయి. జాలా ప్రసాద్ అనే వ్యక్తి మేకపిల్లలను పెంచుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. వీధికుక్కలు ఒక్కసారిగా మేక పిల్లలపై దాడిచేసి చంపేశాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశా రు. దీంతో తాను తీవ్రంగా నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.-

త్రిగుణాత్మికే నమోస్తుతే

లలితా త్రిపురసుందరి దేవిగా రెడ్డెమ్మ

విశేషంగా ఆకట్టుకున్న అలంకరణలు



లలితా దేవిగా వాసవీ మాత (గుర్రంకొండ)

గుర్రంకొండ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): త్రిపురా త్రయంలో రెండో అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి. దశమహావిద్యల్లో ఒక స్వరూపం. సాక్షాత్ ఆది పరాశక్తి ముల్లోకాలకు సుందరి కాబట్టి త్రిపుర సుందరి అంటూరు. షోడశి, లలిత, రాజరాజేశ్వరి స్వరూపాల్లో విరాజిల్లే లలితా త్రిపుర సుందరి 16 ఏళ్ల బాలికా రూపంలో దర్శనం ఇస్తారు. దేవీ శర



లలితా త్రిపుర సుందరి అలంకరణలో దిన్నిమీది గంగమ్మ (పీలేరు)

న్నవరాత్రోత్సవాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. మదనపల్లెలో నాగిరెడ్డివీధి, కమ్మగడ్డవీధిలో, బి.కొత్తకోట జ్యోతిసర్కిల్‌లో ప్రత్యేకించి దుర్గామాతలను యువత ఏర్పాటు చేసింది. పూజల అనంతరం జలనిమజ్జనం చేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

సంతానలక్ష్మీ రెడ్డెమ్మతల్లి లలితా త్రిపురసుందరీ దేవిగా భక్తులను కటాక్షించారు. ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. పోలేరమ్మ అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తరిగొండ వాసవీ మాత ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా కరుణించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పీలేరు అమ్మవార్లు...

పీలేరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవార్లు లలితా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఉదయం అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించి పరిమళభరిత సుగంధ పుష్పాలతో అలంకరించారు. గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ, దిన్ని గంగమ్మ, బండ్లవంకలోని నడివీధి గంగమ్మ, మోడల్ కాలనీలోని ఎల్లమ్మ తల్లి లలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు కనువిందు కలిగించారు. తలపుల సమీపంలోని ఉలవల గంగమ్మ, తిరుపతి మార్గంలోని చౌడేశ్వరి దేవీ, అగ్రహారం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కన్యకా పరమేశ్వరీ అమ్మవారు అన్నపూర్ణా దేవి అవతారంలో దర్శనమిచ్చారు. రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో శనివారం సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆలయాల కమిటీ చైర్మన్లు కె.రామకృష్ణా రెడ్డి, దేవిరెడ్డి వెంకటరమణా రెడ్డి, రామిరెడ్డి, వెంకటమ్మ, శేఖర, ఈఓ మంజుల, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బి.కొత్తకోటలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాందాస్‌చౌదరి - చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న కమిటీసభ్యులు (మదనపల్లె) - ప్రత్యేక అలంకరణలో కలికిరి అమ్మవారు

వాల్మీకిపురంలో వారాహిదేవి...

వాల్మీకిపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయాల్లో అలంకరణలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. నల్లవీరగంగా భవానీ ఆలయంలో ఉదయం అభిషేకం, అర్చన, తోమాలసేవలతో పూజలు, అమ్మవారిని వారాహిదేవిగా అలంకరించారు. కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో వైష్ణవీదేవి, బజారువీధిలోని వాసవీ అమ్మవారు గాయత్రీదేవిగా, చింతపర్తి కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా, వాల్మీకి నగర్‌లోని బోయకొండ గంగమ్మ ఆలయం, గండబోయనపల్లె కోటలో వెలసిన సత్యమ్మతల్లి ఆలయంలో, గొల్లపల్లె విరూపాక్షమ్మ తల్లి ఆలయాల్లో లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలు చేశారు. దేవాలయాల్లో భక్తులతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమాల్లో ఆలయాల ధర్మకర్తలు మొగ్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, పులి సత్యారెడ్డి, కువైట్ శంకరాచారి, తబ్జాల సతీష్, కాంతరాజుశెట్టి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, ఉత్తన్నస్వామి, జనార్ధనస్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వారాహిదేవి అలంకరణలో నల్లవీరగంగాభవాని (వాల్మీకిపురం)



అన్నపూర్ణాదేవి అలంకరణలో చౌడేశ్వరీ మాత (మదనపల్లె)

లలితాదేవిగా చౌడేశ్వరీదేవి

కలకడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోన చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా భక్తులను అనుగ్రహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆకర్షణీయంగా లిలితా త్రిపురసుందరి

కలికిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక యల్లమ్మ తల్లి ఆలయంలో శనివారం అమ్మవారు లలితాత్రిపురసుందరిగా కొలువుదీరారు. అభిషేక, అర్చనానంతర సేవల అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అన్నపూర్ణేశ్వరీ నమోస్తుతే....

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో సాయంత్రం అన్నపూర్ణాదేవి అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ పురాణం చంద్రశేఖర్, బండి పవన్‌కుమార్, రామిశెట్టి రత్నమయ్య, గౌరవాధ్యక్షుడు మోడెం వెంకటరమణ, తదితరులు పర్యవేక్షించారు. కోర్టులో గంగమ్మకు విశేష పూజలు చేశారు. సాయంత్రం కొబ్బరితో అలంకరించి అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో సాయంత్రం వారాహిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్ పర్యవేక్షించారు. దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో మూలవిరాట్టును అలంకరించారు. సోమేశ్వర స్వామి ఆలయంలో భువనేశ్వరీగా, దేవతా నగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో మధురమీనాక్షిగా, బాటగంగమ్మ ఆలయంలో పార్వతీదేవి అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు.



ములకలచెరువులో ప్రత్యంగిరా మాత అలంకరణ



లలితా త్రిపుర సుందరి అలంకరణలో నడివీధి గంగమ్మ (పీలేరు)

ములకలచెరువులో...

ములకలచెరువు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు ప్రత్యంగిరా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తంబళ్లపల్లెలో....

తంబళ్లపల్లె, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

కురబలకోటలో...

కురబలకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరీ అమ్మవారు లలితా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో ఆలయం కిటకిటలాడింది. నాగరాజగుప్త, రామకృష్ణ, బాలకృష్ణ సేతు మాధవ్, అమర్‌నాథ్, రాధారాణి, పుష్పలత, సరళ, అర్చకులు శర్మ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి (కలకడ)

బి.కొత్తకోటలో....

బి.కొత్తకోట, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): నవరాత్రి వేడుకల్లో లలితాత్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నసంతర్పణ కొనసాగింది. జ్యోతిసర్కిల్‌లో దుర్గామాత సేవలో జనసేన రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి పాల్గొన్నారు.



సరస్వతి దేవి అలంకరణలో మాతమ్మతల్లి (నిమ్మనపల్లి)

సరస్వతి దేవిగా మాతమ్మతల్లి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెద్దహరిజనవాడలో వెలసిన మాతమ్మతల్లి సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారిని దూదితో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



లలితా త్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరీ (కురబలకోట)

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

రామసముద్రం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై జీఎస్టీ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ రఫీ, ఎంపీడీఓ లతీఫ్ ఖాన్ వ్యాపారులకు అవగాహన చేపట్టారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు జరిగిందన్నారు. 90వస్తువులపై జీఎస్టీ పన్ను తగ్గించారన్నారు. తగ్గించిన ధరల ప్రకారం వస్తువులు విక్రయించాలని ఆయన వ్యాపారులకు సూచించారు. తగ్గించిన జీఎస్టీ ప్రకారం వస్తువుల ధరల పట్టికను దుకాణాల ముందు ఏర్పాటు చేయాలని సూచించారు. వస్తువుల ధరల పట్టికను త్వరలోనే దుకాణదారులకు అందిస్తామన్నారు. జీఎస్టీ తగ్గక మునుపు కొనుగోలు చేసిన వస్తువులను కూడా తగ్గిన రేట్లతోనే అమ్మాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీఎస్టీ తగ్గింపు వినియోగదారులకు చేరేలా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యాపారులు సిరాజ్‌బాషా, బద్రినాథ్‌శెట్టి, చెంగారెడ్డి, విశ్వనథంశెట్టి, జనార్దన్ బండ్ల పాల్గొన్నారు.



జీఎస్టీ తగ్గింపుపై రామసముద్రంలో అవగాహన కల్పిస్తున్న రఫీ - ఎంపీడీఓకు వినతిప్రతం అందిస్తున్న బసినికొండ గ్రామస్థులు

బసినికొండలో...

మదనపల్లె అర్బన్,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బసినికొండ 1,2లో సూపర్ జీఎస్టీ సేవింగ్ నిర్వహించిట్లు ఎంపీడీఓ తాజ్ మాస్రూర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థులు ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బసినికొండ వన్, టూ సెక్రటరీలు షేక్ నావాజ్, శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది, టీడీపీ నేతలు కత్తిలక్ష్మన్న, చుక్కా విజయ్ కుమార్, ఉమ్మడి గ్రామ అధ్యక్షుడు నటశేర్, కొండప్ప, నారాయణస్వామి, ప్రజలు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు

కలకడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతోందని మండల ప్రత్యేకాధికారి దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అవగహన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఇందుకు సంబంధించి అక్టోబరు 19వ తేదీ దాకా అన్ని సచివాలయాలు డోర్ టు డోర్ కార్యక్రమాలు జరపాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుల కోసం 1915 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని తెలపాలన్నారు. జీఎస్టీ అధికారులు శివయ్య, బాలాజీ, ఎంఈఓ మునీంద్రనాయక్, కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం నిర్వహించాలి

పీలేరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం కేంద్రం తీసుకువచ్చిన జీఎస్‌టీ 2.0 సంస్కరణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సచివాలయ సిబ్బందిని తహసీల్దారు శివకుమార్ ఆదేశించారు. దేశీయ ఉత్పత్తుల కొనుగోలుపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏఎస్ఓ రెడ్డప్ప నాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ సిగ్బతుల్లా, ఎంపీడీఓ రాజేశ్వరి, ఏఓ రమాదేవి, ఏపీఎం జవహర్ పాల్గొన్నారు.

ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తగ్గించిన జీఎస్టీ సేవింగ్స్‌పై ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీరాములు నాయక్ ప్రజలకు వివరించారు. తహసీల్దార్, డిప్యూటీ ఎంపీడీఓ కృష్ణప్రసాద్‌తో కలిసి పీటీఎం సచివాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన చేపట్టారు. కార్యదర్శులు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువులో....

ములకలచెరువు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దార్ ప్రదీప్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి సిబ్బందికి సూపర్ జీఎస్టీ, సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. సదస్సులో ఎస్ఐ నరసింహుడు, ఎంఈఓ వెంకటరమణ, ఏపీఓ నారాయణస్వామి, పాల్గొన్నారు.

పేదలకు ఊరట

గుర్రంకొండ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన సూపర్ జీఎస్‌టీతో పేదలకు మేలు జరిగిందని రాయచోటి ఏఎస్‌టీఓ సతీష్‌బాబు అన్నారు. గుర్రంకొండ వెలుగు కార్యాలయంలో సూపర్ జీఎస్‌టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సంక్షేమం కోసం జీఎస్‌టీలో మార్పులు చేసిందన్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పరిరక్షణ కోసం 28న ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం తెలిపారు. నిమ్మనపల్లె క్రాస్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు చిన్న పిల్లల వైద్యశిబిరం

బి.కొత్తకోట, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యోతిసర్కిల్‌లో ఆదివారం ఉదయం నుంచీ చిన్నపిల్లల వైద్యశిబిరం నిర్వహిస్తారని నవరాత్రి ఉత్సవకమిటీ ప్రతినిధి ప్రకాష్ తెలిపారు. మదనపల్లికి చెందిన సీఎంవీ చిన్నపిల్లల వైద్యశాల వైద్యులు ప్రవీణ్‌కుమార్ చౌడిశెట్టి పిల్లలను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారన్నారు. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.00 వరకు నిర్వహిస్తారన్నారు.

మంత్రిని కలిసిన బీజేపీ నేత కిరణ్



మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గనులు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను శనివారం సచివాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ ఓసూరి కిరణ్‌కుమార్, విజయశంకర్ కలిశారు. అనంతరం మంత్రికి శాలువా కప్పి సన్మానించారు. మంత్రికి మదనపల్లె ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

మిట్స్‌లో ఆకట్టుకున్న దసరా వేడుకలు



మిట్స్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కురబలకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): డీమ్డ్ టు బీ మిట్స్ యూనిర్శిటీలో శనివారం నిర్వహించిన దసరా పండుగ వేడుకలు పలువురిని ఆకట్టుకున్నాయి. యూనివర్శిటీలో మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. ప్రో-ఛాన్సులర్ ద్వారకనాధ్ మాట్లాడుతూ మన దేశం విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలకు పుట్టినిల్లు అని, అందులో విభిన్న పండుగలను చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, రెడ్డి హేమంత్, నవీన్, షాయిజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో దుర్గమ్మ విగ్రహాలు ఏర్పాటు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా శర్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పురవీధుల్లో దుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. నాగిరెడ్డివీధిలో విజేంద్ర, దానేష్, జశ్వంత్, సుముఖ ఆధ్వర్యంలో దుర్గమాతను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కమ్మగడ్డవీధిలో నాదేళ్ల అరుణ్‌తేజ్ బృందం ఆధ్వర్యంలో ఐదు దుర్గామాతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనం చేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఎన్టీఆర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టిన వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ. 6400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఫీజు రియింబర్స్‌మెంట్ కల్పించలేదన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



వర్క్ షాప్‌లో ప్రసంగిస్తున్న ఎన్‌వైకే కో-ఆర్డినేటర్ ప్రదీప్

పీలేరు, సెప్టెంబరు 27(ఆంధ్ర జ్యోతి): ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు జిల్లా నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) యూత్ కో-ఆర్డినేటర్ ప్రదీప్ పిలుపునిచ్చారు. ఎంజేఆర్ కళాశాలలో ఉపాధి, వ్యాపార అవకాశాలపై వర్క్‌షాప్ జరిగింది. యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవకాశాలు కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీ రుణాలు, పూచీకత్తు లేని రుణాలను సద్వినియోగం చేసుకుంటే కలలను నిజం చేసుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ కేవీఎన్ వీఎస్ రావు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు కేవలం ఉద్యోగ అవకాశాలపై మాత్రమే కాకుండా స్వయం ఉపాధి, స్వీయ వ్యాపార నిర్వహణపై కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పీవీఎస్ లక్ష్మి, న్యాయ సలహాదారు డాక్టర్ రాయల సుధాకర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ నేత మృతి



తంబళ్లపల్లె, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎరసానిపల్లె టీడీపీ నేత పోతబోలు కృష్ణమూర్తి శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ మండలంలో పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. కృష్ణమూర్తి మృతి పట్ల టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, ఎరసానిపల్లె గ్రామాధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు మండల టీడీపీ నేతలు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.